Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 222 పేజీలు (Pages): 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

ఆదివారం, 12 - 4 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015





అమరావతి, (రాజధాని వార్తలు): సీఎం క్యాంప్ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమం. జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ముఖ్య మంత్రి చంద్రబాబు, మంత్రులు సవిత, అనగాని సత్యప్రసాద్, పలువురు కార్పొరేషన్ ఛైర్మన్లు, బీసీ నేతలు. జ్యోతిరావు పూలే చేసిన సామాజిక సేవలను స్మరించుకున్న సిఎం, మంత్రులు.

# ఘనంగా మహాత్మా జ్యోతిబా పూలే 200వ జయంతి రాష్ట్ర స్థాయి వేడుకలు

- దేశంలో విద్యా, సామాజిక సమానత్వానికి ఆద్యులు జ్యోతిబా పూలే - పూలే ఆశయ సాధనకు కృషి చేద్దాం - బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది - పూలే ఆశయాలు నేటికీ మార్గదర్శకం - రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత - రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ & ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర గనులు, భూగర్భ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్










విజయవాడ, (రాజధాని వార్తలు): విజయవాడలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో శనివారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే 200 వ జయంతి (ద్విశతాబ్ది) రాష్ట్ర స్థాయి వేడుకలు ఘనంగా పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖామాత్యులు ఎస్.సవిత మాట్లాడుతూ.. మహాత్మా జ్యోతిబా పూలే ఆశయాలను కొనసాగిస్తూ ఈ స్థాయిలో సేవ చేసే అవకాశం తనకు గర్వకారణమని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా, ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలో పూలే జయంతిని రాష్ట్ర పండుగగా ఘనంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. బీసీల అభ్యున్నతికి, రిజర్వేషన్ల అమలుకు స్వర్గీయ నందమూరి తారక రామారావు చేసిన కృషిని ఆమె స్మరించుకున్నారు. పూలే ఆశయా లకు అనుగుణంగా బీసీ గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసిన ఘనత ఆయనదేనన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'ఒక కుటుంబం – ఒక పారిశ్రామికవేత్త' అనే సంకల్పంతో బీసీల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. మహిళా సాధికా రత, పూలే దంపతుల ప్రేరణ మహిళా విద్యకు పూలే దంపతులు నాంది పలికారని, వారి ఆశయాల వల్లే నేడు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వంటి మహిళలు కీలక పదవుల్లో ఎదుగుతున్నారని పేర్కొన్నారు. బీసీ రక్షణ చట్టం, ప్రభుత్వ కట్టుబాటు బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం అవసరాన్ని నారా లోకేష్ ముందుకు తెచ్చారని, ప్రజా పాదయాత్రలో బీసీల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారని తెలిపారు. ప్రభుత్వ వరాలు, బీసీల అభ్యున్నతికి కొత్త నిర్ణయాలు తీసుకున్నామన్నారు. ఈ జయంతి సందర్భంగా బీసీ సంక్షేమం కోసం ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుందని మంత్రి వెల్లడించారు. 6 బాలికల కళాశాలలకు ఇంటర్మీడియట్ అప్‌గ్రేడేషన్ అనుమతి గురుకుల పాఠశాలల శాశ్వత భవనాల నిర్మాణానికి 500 కోట్లు మంజూరు మహాత్మా జ్యోతి బా పూలే స్మృతి వనం ఏర్పాటుకు స్థల పరిశీలన చేశామని, కూటమి ప్రభుత్వాన్ని బీసీల ప్రభుత్వంగా అభివర్ణిస్తూ, బీసీలందరూ ఐక్యంగా ఉండి ప్రభుత్వానికి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ & ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నా యుడు మాట్లాడుతూ..వందల ఏళ్ల క్రితమే కుల వివక్షకు వ్యతిరే కంగా స్వరమెత్తి, విద్య యొక్క (మిగతా 8వ పేజీలో)

# భారత్‌కు నేటికీ దారి చూపే ధృవతార జ్యోతిరావు పూలే : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ: ఏప్రిల్ 11 నేడు. మనందరికీ చాలా ప్రత్యేకమైన రోజు. భారతదేశపు అగ్రశ్రేణి సంఘ సంస్కర్తల్లో ఒకరు, తరతరాలకూ మార్గదర్శిగా నిలిచిన క్రాంతిపథగామి మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి నేడు. ఆయన ద్విశతాబ్ది జయంత్యుత్సవాల ప్రారంభం నేపథ్యంలో, ఈ ఏడాది మరింత విశిష్టతను సంతరించుకున్నది. మహాత్మాపూలే గొప్ప సంఘసంస్కర్త. అంతేకాదు.. నైతిక స్థైర్యం, నిరంతర సత్యాన్వేషణ, సామాజిక శ్రేయస్సు పట్ల అచంచలమైన అంకితభావం కలబోసిన ఉదాత్త జీవితం ఆయనది. ఎన్నో సంస్థలను నెలకొల్పి, ఎన్నో ఉద్యమాలకు సారథ్యం వహించి చిరస్మరణీయులయ్యారు పూలే. ఆయన రేకెత్తించిన సరికొత్త ఆశలు, దేశజనుల్లో నింపిన ఆత్మవిశ్వాసం, మన నాగరికతా పరిణామ క్రమంలో ఆయన చేసిన అసమానమైన సేవలూ... నేటికీ లక్షలాది మందికి స్ఫూర్తిని అందిస్తున్నాయి. పుణ్యభూమి మహారాష్ట్రలో 1827లో మహాత్మాపూలే జన్మించారు. అతిసామాన్య నేపథ్యం నుంచి ఎదిగారాయన. కానీ తొలినాటి కష్టాలేవీ ఆయన అభ్యాసానికీ, ధైర్యానికీ, సామాజిక నిబద్ధతకూ అడ్డుగోడలు కాలేకపోయాయి. సవాళ్లు ఏవైనా సరే – నిశ్చేష్టులుగా ఉండిపో కుండా.. కష్టపడి జ్ఞానాన్ని ఆర్జించి, ఆ సమస్యలను పరిష్కరించు కోవాలన్న దృఢ సంకల్పమే ఆయనలో ఎన్నడూ తొణికిసలాడేది. చిన్నతనంలోనే, విద్యార్థి దశ నుంచే జ్యోతిరావు పూలేలో అపార మైన జిజ్ఞాస ఉండేది. నిరంతర అధ్యయనశీలి. తన వయసు పిల్లల స్థాయికి మించిన పుస్తకాలను చదివేవాడు. "మనం ఎంత ప్రశ్నిస్తే అంత జ్ఞానాన్ని పొందుతాం" అని తర్వాతి కాలంలో ఆయనే చెప్పారు. చిన్ననాటి నుంచే ఆయనకు అలవడిన ఆ సత్యాన్వేషణ దృక్పథం ఎక్కడా రాజీపడకుండా జీవితాంతమూ కొనసాగింది. విద్యనూ, జ్ఞాన సముపార్జననూ జీవిత లక్ష్యాలుగా మలచుకున్నారు మహాత్మాపూలే. జ్ఞానం కొందరి గుత్తాధిపత్యం కాదనీ, ఆ శక్తి అందరికీ అందాలనీ స్పష్టంగా గుర్తించారాయన. సమాజంలో అనేకులకు అక్షర జ్ఞానం అందని ద్రాక్షగా ఉన్న ఆ కాలంలోనే బాలికల కోసం, విద్యావకాశాలు లేని వర్గాల కోసం పాఠశాలలను తెరిచి విద్యా విప్లవానికి నాంది పలికారు. "తల్లి ద్వారా బిడ్డకు అందే సంస్కారం అమూల్యమైనది. అందుకే, పాఠశాలలు తెరవాలనుకుంటే మొదట బాలికల కోసమే తెరవాలి" అనేవారాయన. సామాజిక న్యాయాన్నీ, సమానత్వాన్నీ సాధించే శక్తిమంతమైన సాధనంగా తరగతి గదిని నిలిపి.. ఓ సరికొత్త సామాజిక దృక్పథాన్ని ఆవిష్కరించేందుకు ఆయన ఎంతగానో కృషి చేశారు. విద్య పట్ల ఆయన దార్శనికత మనందరికీ స్ఫూర్తిదా యకం. దేశ యువతలో పరిశోధన, ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంపొందించడం లక్ష్యంగా గత పదేళ్లుగా మేమెంతో కృషి చేశాం. ప్రశ్నించేలా, అన్వేషించేలా, నూతన ఆవిష్కరణలు చేసేలా యువ తరాన్ని ప్రోత్సహించే పటిష్టమైన వ్యవస్థను నిర్మిస్తున్నాం. విజ్ఞానం, నైపుణ్యాలు, అవకాశాల్లో పెట్టుబడుల ద్వారా.. సమస్యల పరిష్కర్తలుగా, దేశ ప్రగతికి సారథులుగా భారత్ తన యువతను సశక్తులుగా తీర్చిదిద్దుతోంది. మహాత్మాపూలే తన విజ్ఞానంతో, వివేకంతో... వ్యవసాయం, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి వంటి రంగాలపై విస్తృత అవగాహనను (మిగతా 2వ పేజీలో)

# అమరావతిపై జగన్ పార్టీ విషపు ప్రచారంపై విరుచుకుపడ్డ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ

అమరావతి, (రాజధాని వార్తలు): అమరావతిపై జగన్ పార్టీ నేతలు రోజుకో విధంగా మాట్లాడుతున్నారు. ఎన్డీఏ మేనిఫె స్టోలో అమరావతిని వెంటనే చేస్తామని చెప్పాం. ఐతే వారు ఊహించలేదు ఇంత స్పీడ్‌గా పనులు అవుతాయని, ఇప్పుడు పనులు జరుగుతుంటే వారిలో ఆందోళన ప్రారంభం అయింది. రైతులు ముఖ్యమంత్రిని పార్లమెంట్‌లో చట్టం చేయాలని కోరారు. సీఎం ప్రధానిని అడిగి దానికి ఒప్పించారు.. బిల్లు ఆమోదం పొందింది. పార్లమెంట్‌లో డిస్కషన్ జరుగుతుంటే ఎంపీలకు ఏం చేయాలో చెప్పకుండా ఇక్కడ ప్రెస్మీట్ పెట్టి మావిగన్ అన్నారు. హైదరాబాద్ సెక్రటేరియట్ 615 కోట్లకు టెండర్‌లు ఇచ్చారు.. దానికి చేసిన ఖర్చు 1423 కోట్లు పైనే. 13,763 రూపాయలు స్క్వేర్ ఫీట్‌కు అయ్యింది. ఐకానిక్ బిల్డింగ్‌లో స్ట్రక్చర్‌కు పిలిచాము. మిగిలిన పనులకు తరువాత పిలుస్తాం. పార్లమెంట్‌లో 6 లక్షల 94 వేల చదరపు అడుగులకు ప్లాన్ చేశారు. 862 కోట్లుకు టెండర్‌లు పిలిచి 1172 కోట్లు చెల్లించారు...చదరపు అడుగుకు 16 వేల 900 రూపాయలు ఖర్చు అయింది. పార్లమెంట్‌లో బిల్లు అయి పోయింది...భారత దేశంలో ఉన్న అన్ని పార్టీలు చేతులు ఎత్తారు. ఒక్క పార్టీ తప్ప అన్ని పార్టీలు అమరావతికి మద్దతు ఇచ్చాయి.. అందుకే ప్రజలు ప్రశాంతంగా ఉండకూడదని



ఇలా మాట్లాడుతు న్నారు. ఇన్ఫ్రాస్ట్రక్చర్ తీసుకుంటే నేషనల్ హై వేలో కేవలం రోడ్ వేస్తారు అంతే....ఇక్కడ అమరావతిలో అంతర్జాతీయ స్థాయిలో చేస్తున్నాం. దోమలు లేని నగరం కావాలంటే 100 శాతం యుజిడి ఉండాలి. ఇక్కడ లైట్‌లు గ్రీనరీ, పార్కులు....2014-19 తరువాత ఇవి పూర్తి అయి వుంటే చాలా ఖర్చు తగ్గేది.తారు కాస్ట్ 83.33 శాతం అప్పటికి ఇప్పటికీ పెరిగింది. గతంలో SSR 1365 రూపాయలు నుండి ఇప్పుడు 1665 రూపాయలకు చేరుకుంది. స్టీల్ 57,298 ఉంటే ఇప్పుడు 40.03 శాతం పెరిగింది. ఈ విధంగా రేట్‌లు భారీగా పెరిగాయి...ఈ తప్పంతా గత ప్రభుత్వానిదే. ఎవ్వరికి నామినేషన్‌లో ఇవ్వలేదు. టెండర్‌లు నేషనల్, ఇంటర్నేషనల్ లెవెల్‌లో ఇచ్చాము. అమరా వతిని ఎవ్వరు కదిలించలేరని అర్థం అయ్యి ఈ రాగాలు తీస్తున్నారు. 98.6 శాతం మంది రైతులకు ప్లాట్లు అలాట్ చేశాం. 62,942 మందికి ప్లాట్‌లు రిజిస్టర్ చేశాం. ఈ రోజుకు 31 వేల 150 మంది రైతులు 34,983 ఎకరాలు ఈ రోజుకు ఇచ్చారు. 30 వేల 74 మంది రైతులకు ప్లాట్‌లు ఇచ్చాం. మిగిలిన కొద్ది మందికి కోర్టు లిటిగేషన్‌తో ఆగాయి. 651 మందికి 450 ఎకరాలు ఇవ్వాల్సి ఉంది. ప్లాట్‌లకు బౌండరీలు రోడ్‌లు డ్రైనేజ్ లు వెయ్యగానే రాళ్ళు వేస్తారు. దీన్ని కూడా ఇష్యూ చేస్తారు...సజ్జల, ధర్మాన, బొత్స సత్యనారాయణ ఒక్కొక్కళ్ళు ఒక్కోటి మాట్లాడు తారు. ఐకానిక్ టవర్‌లకు 15, 16 వేలు అవుతుంది. నార్మన్ ఫాస్టర్‌లు డిజైన్ లు ఇస్తారు ఇవ్వగానే అవుతుంది. టెండర్‌లు ద్వారానే కాంట్రాక్ట్‌లు ఇచ్చాము... నామినేషన్‌తో ఇవ్వలేదు. గత ప్రభుత్వానికి కడుపు మంట... పనులు జరుగుతున్నాయి అని ఎంఎల్ఏ క్వార్టర్స్ పని పూర్తి అయిపోయాయి 15,16 న జేఏడి కి హ్యాండ్ ఓవర్ చేస్తాం. బేసిక్ ఫెసిలిటీస్ షాపింగ్ కాంప్లెక్‌లాంటివి ఏర్పాటు చేస్తున్నాం. 5000 ఎకరాలు ల్యాండ్ బ్యాంక్ ఇప్పుడు మేము పక్కన పెట్టాము. హైటెక్ సిటీ కట్టినప్పుడు ల్యాండ్ రేట్ ఎంత.. ఇప్పుడ అక్కడ 148 కోట్లుగా ఉంది. అమరావతి రాజధాని అప్పులు.. ప్రజల పన్నుల ఆదాయంతో చెల్లించం అమరావతి భూములు 5000 ఎకరాలు అమ్మి కడతాం. విజన్ ఉన్న నాయకుడు అలా ఆలోచిస్తారు. జగన్, ఆ పార్టీ వాళ్ళు చెపుతున్న లెక్కలు పచ్చి అబద్ధాలు. మావిగాన్ అనే ప్రతిపాదన ను ప్రజలు ఛీ కొడుతున్నారు. ఇలా మాట్లాడి పెట్టుబడులు రాకుండా చేయడానికి విష ప్రచారం చేస్తున్నారు. విశాఖపట్నం ఒక రాజధాని అన్నారు, విశాఖలో ఆ పార్టీ మొత్తం తుడుచుకు పెట్టుకు పోయింది. మాస్టర్ ప్లాన్ లో విజయవాడ, గుంటూరు ఉంది, దానిలో మచిలీపట్నం కలిపి మావిగాన్ అంటున్నారు. అమరావతి రాజధానికి 10 వేల కోట్లు ఇప్పటికీ ఖర్చు అయింది, 51 వేల కోట్ల రూపాయలకు టెండర్ లు పిలిచాం. అమరావతి నిర్మాణం జరిగితే ఎకరా 20 కోట్లకు పెరుగు తుంది. అమరావతి రాజధాని లో 217 చదరపు కిలోమీటర్ల కు ప్లాన్ చేశాం. ఇప్పుడు ప్రాజెక్ట్ వారీగా భూములు తీసు కుంటున్నాం. నిన్న పెదపరిమిలో 1000 ఎకరాలు ల్యాండ్ పూలింగ్ కు రైతులు ఇచ్చారు. పార్లమెంట్ చట్టం లో సిఆర్ డిఏ రీజియన్ ను స్పష్టం గా డిజైన్ చేశారు. బ్యాంక్ లకు ఇచ్చిన భూములు కు కేంద్రం బడ్జెట్ శాంక్షన్ చేసింది.

# నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పి డా.అజిత వేజెండ్ల












**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఎస్‌పిఎస్ నెల్లూరు జిల్లా పోలీసు కార్యాలయంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పోలీసు అధికారులతో జిల్లా ఎస్పి డా.అజిత వేజెండ్ల, ఐపిఎస్ నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ, స్మార్ట్ పోలీసింగ్ సాంకేతికత అప్లికేషన్లో భాగంగా సెంట్రల్ క్రైమ్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్, సీసీటీవీ నిఘా, డ్రోన్ సర్వైలెన్స్ మరియు ఇతర డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను సమర్థవంతంగా వినియోగించి నేరాలను ముందుగానే గుర్తించి, ప్రజలకు వేగవంతమైన మరియు పారదర్శక సేవలు అందించవచ్చని తెలిపారు.

ఎస్పి ఇచ్చిన ముఖ్య సూచనలు:


గ్రేవ్ కేసుల దర్యాప్తును నిర్ణీత గడువులో పూర్తి చేసి, ఛార్జ్ షీట్లు దాఖలు చేయాలి. పిజిఆర్ఎస్ పిటిషన్లను తక్షణమే పరిష్కరించాలి. డయల్ 112 కాల్స్‌కు వెంటనే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకోవాలి. ప్రతి కేసులో టెక్నికల్ ఎవిడెన్స్ సేకరణపై దృష్టి పెట్టి, కన్విక్షన్ రేటును పెంచాలి. ఓపెన్ డ్రింకింగ్‌పై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి, సంబంధిత నేరాలను నియంత్రించాలి. రౌడీ షీటర్ల కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచి, నిబంధనలు ఉల్లంఘించిన వారి బెయిల్ రద్దు చేయించే చర్యలు తీసుకోవాలి. రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలతో కలిసి ప్రతి పిఎస్ పరిధిలో బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి, పక్డ్ బంది నివారణ చర్యలు తీసుకోవాలి. డ్రోన్ సర్వైలెన్స్ విస్తృతంగా నిర్వహించాలి. ముఖ్య ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రజల్లో అవగాహన కల్పించాలి. అనుమానిత ప్రాంతాల్లో కార్డన్ & సెర్చ్ ఆపరేషన్స్ నిర్వహించాలి. మిస్సింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వేగవంతంగా చర్యలు తీసుకోవాలి. ప్రతి అధికారి తప్పనిసరిగా గ్రామాల సందర్శనలు చేపట్టి, స్థానిక సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించాలి. రాత్రి పూట గస్తీలను ముమ్మరం చేసి, అనుమానితుల వేలిముద్రలు సేకరించాలి.

అనంతరం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ & నాన్-గ్రేవ్ కేసులు, హత్య కేసులు, POCSO & రేప్ కేసులు, డెకాయిటీ, రాబరీ, ప్రాపర్టీ మరియు వాహన దొంగతనం కేసులు, మిస్సింగ్ కేసులు, చీటింగ్ కేసులు, రోడ్డు ప్రమాదాలు, 174 Cr.P.C కేసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్, పెండింగ్ NBWs, ఎన్‌డిపిఎస్ కేసుల దర్యాప్తు మరియు రికవరీలపై సర్కిల్ వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పి (అడ్మిన్) సౌజన్య, టౌన్ ASP దీక్ష, ఐపిఎస్, జిల్లాలోని డిఎస్పీలు మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా గ్రామోత్సవం





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నూతన రాజగోపుర శిఖర కలశాల ఊరేగింపు వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి విచ్చేసి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి అర్చక స్వాములు వేద ఆశీర్వచనాలు తీర్థ ప్రసాద వినియోగాలను అందజేశారు. అనం తరం కలిశాల గ్రామోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దారి పొడవునా నీరాజనాలు అందించారు.

హరినాధపురంలోని ప్రధాన వీధుల్లో జరిగిన ఈ ఊరేగింపులో అడుగడుగునా భక్తులు హారతులు ఇచ్చి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులతో పాటు పలువురు కార్పొరేటర్లు, నగర ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు స్థానికులు పాల్గొన్నారు.

# “ఉషా బాల” బాలల మాస పత్రిక ఆవిష్కరణ

## - ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులు డా.గజల్ శ్రీనివాస్




**ఒంగోలు, (రాజధాని వార్తలు):** ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహించ తలపెట్టిన నాలుగవ ప్రపంచ తెలుగు మహా సభలు బాలలు - 2026 సందర్భంగా ఆంధ్ర శ్రీ పురస్కార గ్రహీత, ఆంధ్ర ప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ శ్రీ విల్సన్ శరత్ చంద్ర సంపాదకత్వంలో రూపొందుకున్న బాల బాలల మాస పత్రిక “ఉషా బాల”ను ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాస రెడ్డి ఆవిష్కరించగా, తొలి ప్రతిని శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్‌కి అందజేశారు. 5, 6 డిసెంబర్ 2026 న నిర్వహించ తలపెట్టిన నాలుగవ ప్రపంచ తెలుగు మహా సభలు - బాలలు -2026 ను అందరం కలిసి గొప్పగా విజయ వంతం చేయాలని, ప్రకాశం జిల్లా చరిత్రలోనే ఒక చారిత్రాత్మక ఘట్టంగా నిర్వహించడానికి మా సహకారం ఉంటుందని మాగుంట శ్రీనివాస రెడ్డి, దామచర్ల జనార్ధన్ అన్నారు. 40 దేశాల నుండి బాల బాలికలు ప్రతినిధులుగా వస్తున్నారని, తెలుగు సంస్కృతిలోని సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలు బాలబాలికలు ప్రదర్శన చేస్తున్నట్లు, వారే మహా సభలు నిర్వహించేటట్లుగా వారిని తీర్చిదిద్దుతున్నట్లు పరిషత్తు అధ్యక్షులు డా.గజల్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మహా సభలకు ఆతిథ్యమివ్వడానికి ముందుకు వచ్చిన నెక్స్ట్ జన్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవస్థాపకులు డా.మురళీధర్ రెడ్డి, కోగంటి శ్రీకాంత్‌లను అతిథులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు సాహితీ ప్రముఖులు పొన్నూరు శ్రీనివాస్, కొండారెడ్డి, ఎమ్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధన దిశగా కూటమి ప్రభుత్వం

## - సామాజిక సమానత్వానికి మార్గదర్శి మహాత్మా పూలే - సమాజంలోని అసమానతలను రూపు మాపి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తోడ్పడటమే పూలేకి ఇచ్చే నిజమైన నివాళి : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** భారత సామాజిక విప్లవ పితామహుడు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆయనకు ఘన నివాళులు అర్పించారు. కుల వివక్ష లేని సమాజం కోసం అణగారిన వర్గాల హక్కుల కోసం పూలే చేసిన పోరాటం దేశ చరిత్రలో అజరామరమని ఆమె ఒక ప్రకటనలో కొనియాడారు. ముఖ్యంగా మహిళా విద్యే సామాజిక మార్పుకు మూలమని నమ్మిన పూలే, తన సతీమణి సావిత్రిబాయి పూలేతో కలిసి చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి. మహాత్మా పూలే ఆశయాలకు అనుగుణంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వెనుకబడిన మరియు బడుగు, బలహీన వర్గాల సర్వతోముఖాభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. బలహీన వర్గాలను వెన్నెముకగా భావించే కూటమి ప్రభుత్వం వారి ఆర్థిక మరియు రాజకీయ సాధికారత కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వెనుకబడిన వర్గాలకు అండగా నిలుస్తూ పూలే కలలుగన్న సామాజిక సమానత్వ ఆశయ సాధనకు కృషి చేస్తుందన్నారు. అణగారిన వర్గాల గొంతుకగా నిలిచిన మహాత్మా పూలే అడుగుజాడల్లో



నడుస్తూ కోవూరు నియోజకవర్గంలోని ప్రతి పేదవాడికి ప్రభుత్వ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వెల్లడించారు. సమాజంలోని అసమానతలను రూపు మాపి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి తోడ్పడటమే మహాత్మా జ్యోతిరావు పూలేకి ఇచ్చే నిజమైన నివాళి అని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తెలిపారు.

# భారత్‌కు నేటికీ దారి చూపే ధృవతార జ్యోతిరావు పూలే : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

(మొదటి పేజీ తరువాయి)

పెంపొందించుకున్నారు. రైతులు, కార్మికులకు అన్యాయం జరిగితే మన సమాజం బలహీనపడుతుందని ఆయనెప్పుడూ చెప్పేవారు. పొలాల నుంచి పల్లెల దాకా.. రోజువారీ జీవితంలో సామాజిక అసమానతల తీవ్రతను ఆయన నిశితంగా గమనించారు. అందుకే పేదలు, అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని కాపాడడంలో ఆయన పూర్తిగా నిమగ్నమయ్యారు. అలాగే సామాజిక సామరస్యం కోసం శక్తివంచనలేకుండా నిర్విరామంగా కృషి చేశారు. “జోపర్యంత సమాజాతీల సర్వానా సమాన అధికార మిళత్ నహీత్, తోపర్యంత ఖరే స్వతంత్ర్య మిళత్ నహీ (సమాజంలోని ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించేంత వరకు నిజమైన స్వేచ్ఛను సాధించలేము)” అన్నది మహాత్మాపూలే అభిప్రాయం. సమ సమాజం లక్ష్యంగా.. ఈ ఆశయాన్ని కార్యాచరణగా మలిచే దిశగా ఎన్నో సంస్థలను ఆయన నెలకొల్పారు. ఆయన స్థాపించిన సత్యశోధక సమాజం ఆధునిక భారతదేశంలో అత్యంత ముఖ్యమైన సామాజిక సంస్కరణ ఉద్యమాల్లో ఒకటి. సామాజిక సంస్కరణ, సమాజ సేవ, మానవ గౌరవాన్ని పెంపొందించడంలో ఇది అగ్రగామిగా నిలిచింది. మహిళలు, యువత, గ్రామీణ ప్రజలకు గొంతుకైంది. న్యాయం, ప్రతి వ్యక్తికీ గౌరవం, సమష్టి పురోగతి స్ఫూర్తిని కేంద్రంగా నిలపడం ద్వారా.. సమాజాన్ని శక్తిమంతంగా తీర్చిదిద్దవచ్చన్న మహాత్మాపూలే విశ్వాసానికి ఈ ఉద్యమం నిదర్శనం. ఆయన వ్యక్తిగత జీవితమూ ధైర్యసాహసాలను బోధించే పాఠమే. నిరంతరం జనబాహుళ్యంలో ఉంటూ ప్రజల కోసం పరితపించడం ఆయన ఆరోగ్యంపై ప్రభావం చూపింది. అత్యంత క్లిష్టమైన అనారోగ్య సమస్యలు కూడా ఆయన సంకల్పాన్ని సడలించలేకపోయాయి. పక్షవాతం బారిన పడి శరీరం సహకరించని స్థితిలోనూ తన కృషిని కొనసాగించారు. అవును, ఆయన శరీరం కఠిన పరీక్షను ఎదుర్కొని ఉండవచ్చు.. కానీ సమాజం పట్ల ఆయన నిబద్ధత మాత్రం సడలలేదు. ఆయన జీవితంలోని ఈ అకుంఠిత దీక్షే.. నేడు ఎన్నో కష్టాలకోర్చి, పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తున్న లక్షలాది మందికి స్ఫూర్తినిస్తోంది. గౌరవ సావిత్రీబాయి పూలేను స్మరించుకోకుండా మహాత్మా జ్యోతిరావు పూలే స్మృతి అసంపూర్ణమే అవుతుంది. దేశం గర్వించదగ్గ అగ్రశ్రేణి సంస్కర్తల్లో ఆమె ముందువరుసలో నిలుస్తారు. దేశపు తొలితరం మహిళా ఉపాధ్యాయినిగా, బాలికా విద్యా వికాసంలో ఆమె నిర్ణయాత్మక పాత్ర పోషించారు. తద్వారా వారు కలలను సాకారం చేసుకునే అవకాశాన్నిచ్చారు. మహాత్మా పూలే మరణానంతరమూ.. ఆ ఆశయ దీప్తిని సావిత్రీబాయి ఆరనివ్వలేదు. 1897లో ప్లేగు వ్యాధి విరుచుకుపడిన తరుణంలో.. బాధితుల సేవలో ఆమె పునరంకితమయ్యారు. చివరకు అదే వ్యాధికి గురై ప్రాణాలు విడిచిన త్యాగమూర్తి ఆమె. మనది పుణ్యభూమి. విశిష్టమైన భావాలు, నిరుపమాన త్యాగాలు, అకుంఠిత దీక్షతో మన సమాజాన్ని శక్తిమంతంగా మలచిన మహనీయులు, వీరనారులకు నిలయమిది. మార్పు ఎక్కడినుంచో మొదలవుతుందని ఎదురుచూడలేదు. వారే మార్పునకు నాంది పలికారు. శతాబ్దాల నుంచి దేశంలో సామాజిక పురోగతి దిశగా.. మన సమాజం నుంచే శంఖారావం వినిపించింది. పీడితుల వ్యథను గుర్తించి.. దానిని ‘తలరాత’ అని సరిపెట్టుకోకుండా ఎదురుతిరిగిన వారి నుంచి ఆ చైతన్యం పుట్టుకొచ్చింది. అలాంటి యోధుల్లో ఒకరు మహాత్మా జ్యోతిరావు పూలే. 2022లో పూణే పర్యటన సందర్భంగా.. అక్కడి మహాత్మా పూలే భవ్య విగ్రహం వద్ద నివాళి అర్పించడం నాకెప్పటికీ గుర్తుంటుంది. ఆయన ద్విశతాబ్ది జయంత్యుత్సవాల ప్రారంభ వేళ.. ఆయన ఆశయాల దిశగా పునరంకితం కావడమే మనం అర్పించే ఘనమైన నివాళి. ముఖ్యంగా ఆయనకెంతో ఇష్టమైన విద్య వంటి ఆదర్శాలకు మనం పునరంకితం కావాలి. అన్యాయంపై నిరసన తెలిపే సున్నితత్వాన్ని పెంచుకోవాలి. సమాజ స్వయం సంస్కరణ సామర్థ్యంపై మన విశ్వాసాన్ని బలంగా చాటాలి. నైతిక స్పష్టత, ప్రజా ప్రయోజనం రెండూ తోడైతే.. ఈ సమాజ శక్తి దేశంలో అద్భుతాలు సృష్టించగలదని ఆయన జీవితం నిరూపించింది.

అందుకే నేటికీ లక్షలాది మందికి ఆయన ఆలోచనలు బలాన్నిస్తున్నాయి. ఆయన మాటలూ, చర్యలూ నేటికీ ఆశను చిగురింపజేస్తున్నాయి. ఆయన జన్మించి దాదాపు రెండు వందల ఏళ్లు గడుస్తున్నా - మహాత్మా జ్యోతిరావు పూలే గత కాలపు శక్తిగానే కాకుండా.. నవ భారత భవితకు మార్గదర్శిగా విరాజిల్లుతున్నారు.

# కరపలో సహకార సొసైటీ పనితీరుపై అధికారుల సమీక్ష

## - సొసైటీలో ఎరువుల నిల్వలపై జిల్లా అధికారుల తనిఖీ

## - ఖరీఫ్‌కు ఎరువుల కొరత లేదు : జేడీ విజయకుమార్





**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్ మండల కేంద్రం కరపలో సహకార సొసై టీని వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ విజయకుమార్, జిల్లా సహకార అధికారి శ్రీనివా సరెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సొసైటీలో జరిగిన ఎరువుల విక్రయాలు, మార్క్‌ఫెడ్‌కు చెల్లింపులు తదితర అంశాలను వారు సమగ్రంగా పరిశీలించారు. సొసైటీకి సంబంధించిన రికార్డులు, నిల్వల వివరాలను జిల్లా సహకార అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఎరువుల కొరత లేదని తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు ఇప్పటికే 8 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు నిల్వలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సీజన్‌లో మొత్తం 35 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా చేయగా, రైతులు సుమారు 27 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే వినియోగించారని వెల్లడించారు. మిగిలిన 8 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు సొసైటీలు, డీలర్లు, రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వచ్చే సీజన్‌కు సుమారు 68 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవస రమని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న నిల్వలను ఖరీఫ్‌లో వినియోగిస్తామని చెప్పారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావం ఎరువుల సరఫరాపై లేదని స్పష్టం చేశారు.

ప్రతి నెల జిల్లాకు అవసరమైన ఎరువుల కోటా సమయానికి అందుతోందన్నారు. మే 15 నుంచి కాలువలకు నీరు విడుదల చేయనున్నట్లు తెలిపారు. రైతులు జూన్ నెలలోపు నాట్లు పూర్తి చేసుకోవాలని సూచించారు. సాగునీటి సమస్యలు తలెత్తకుండా పీఎండీఎస్ విధానాన్ని పాటించాలని సూచించారు. ముందస్తుగా నీటి విడుదల జరగనున్నందున రైతులు ఇప్పటి నుంచే రబీ పనులు ముగించుకుని నాట్లకు సిద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కే. బాబూరావు, మండల వ్యవసాయ అధికారి ఐ.సత్య, సొసైటీ చైర్మన్ భవాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బ నివారణ గురించి అవగాహన కార్యక్రమం

**తిరుపతి, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి బాలకృష్ణ నాయక్ మార్గదర్శకత్వంలో శుక్రవారం తిరుపతి ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్‌నందు వడదెబ్బ నివారణ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది బస్టాండ్‌లో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు మరియు అక్కడ వేచి ఉన్న ప్రయాణికులకు సూర్యా ఘాతం (వడ దెబ్బ) గురించి అవగాహన కల్పించారు. అధికారులు మాట్లాడుతూ వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా వడదెబ్బ ప్రమాదం పెరుగుతుందని బయట పనిచేసే కార్మికులు, డ్రైవర్లు, కండక్టర్లు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉపయోగించే విధానాన్ని డెమోన్స్ట్రేషన్ నిర్వహించి అక్కడ ఉన్న ప్రజలకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగింది.బస్టాండ్ ఆవరణంలో కూలింగ్ ఏరియాస్, తాగునీటి సదుపాయం, ఓఆర్ఎస్ కార్నర్ పాయింట్లు ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఓ సూచించారు. వడదెబ్బకు గురి కాకుండా ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలు 1 ఎండలో బయటకు వెళుతున్నప్పుడు టోపీ, రుమాలు లేదా గొడుగు ఉపయోగించాలి. 2. తేలికపాటి కాటన్ దుస్తులు ధరించాలి. 3.దాహం లేకపోయినా తరచూ నీరు త్రాగాలి 4.ఓ ఆర్ ఎస్ ద్రావణం, నిమ్మరసం, మజ్జిగ వంటి ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి 5.ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో బయట పనులు మానుకోవాలి. వడదెబ్బ



లక్షణాలు: తలనొప్పి, తల తిరగడం, అధిక శరీర ఉష్ణో గ్రత, వాంతులు, అలసట, చమటలు ఆగిపోవడం, అపస్మారక స్థితి. ఒకవేళ ఈ లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా కండక్టర్లు, డ్రైవర్లు మరియు ప్రజలకు వడదెబ్బ పట్ల అవగాహన పెంపొందించడమే లక్ష్యం అని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ సి డి పి. ఓ. డాక్టర్ రెడ్డి ప్రసాద్, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ సెల్వియా, డిపిఎమ్ఓ డాక్టర్ చత్ర ప్రకాష్ రెడ్డి, డీఎస్ఓ డాక్టర్ జితేంద్ర ఆర్టీసీ రీజనల్ మేనేజర్, కంట్రోలర్, యూపీహెచ్సీ వైద్యాధికారులు, ఏఎన్ ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎన్సీడీ సిబ్బంది మరియు ఐ డి ఎస్ పి పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ కుటుంబాల్లో సోలార్ వెలుగులు : ఎమ్మెల్యే కృష్ణారెడ్డి



**కావలి, (రాజధాని వార్తలు):** నియోజకవర్గంలోని నిరుపేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాల జీవితాల్లో విద్యుత్ వెలుగులు నింపడమే లక్ష్యంగా ప్రభుత్వం కట్టుబడి ఉందని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి తెలిపారు. కావలి రూరల్ మండలం రాజువారి చింతనపాలెం గ్రామంలో నిర్వహించిన పీఎం సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, కావలి, బోగోలు, దగదర్తి, అల్లూరు మండలాల్లో కలిపి మొత్తం 72 కోట్ల 41 లక్షల భారీ బడ్జెట్‌ను ఈ పథకానికి కేటాయించినట్లు వెల్లడించారు. ఈ యోజన ద్వారా నియోజకవర్గ వ్యాప్తంగా 5,886 మంది ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత సోలార్ రూఫ్‌టాప్ ప్యానెల్స్ అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు వల్ల నిరుపేద కుటుంబాలపై విద్యుత్ బిల్లుల భారం పూర్తిగా తగ్గి, ప్రతి ఇంటికి ఉచితంగా విద్యుత్ అందుతుందని ఆయన వివరించారు. ఇదే సమయంలో బీసీ, ఓసీ వర్గాలకు కూడా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తూ 78,000 వరకు సబ్సిడీ కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధి పనులపై కూడా ఎమ్మెల్యే ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. రాజువారి చింతనపాలెం గ్రామంలో పాత విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేయడంతో గాలివానల సమయంలోనూ విద్యు త్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. అదేవిధంగా వర్షాధారిత ప్రాంతాలైన ఆశీర్వాదపురం, కొత్తపల్లి, చల్లంచర్ల గ్రామాలకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందించేందుకు తాను కట్టుబడి ఉన్నానని, రైతు బిడ్డగా మాట ఇస్తున్నానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఈఈ బెనర్జీ, ఏడీఈలు రవిచంద్ర, రవికుమార్, ఏఈలు, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయ కులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా పాశం శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

## - వృద్ధులకు అన్నదానం, సరుకుల పంపిణీ









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని గీతామయి వృద్ధాశ్రమంలో ఏపీ ఎం.ఎస్.ఎం.ఈ మాజీ డైరెక్టర్, వైఎస్సార్సీపీ జిల్లా సీనియర్ నాయకులు పాశం శ్రీనివాస్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన శ్రేయోభిలాషులు కేక్ కటింగ్ నిర్వహించి ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు పాశం శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా వృద్ధాశ్రమంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆశ్రమం స్థాపించినప్పటి నుండి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్న పాశం శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలను ఆయన శ్రేయోభిలాషులు వృద్ధుల నడుమ నిర్వహించారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం వృద్ధులందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే ఆశ్రమానికి అవసరమైన సరుకులను విరాళంగా అందజేశారు. వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో పాశం శ్రీనివాస్ రాజకీయంగా మరింత ఉన్నత పదవులు అధిరోహించాలని ఆశ్రమ ప్రతినిధులు ఆకాంక్షించారు. పాశం శ్రీనివాస్ భవిష్యత్తులో రాజకీయంగా ఎంతో ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని, శ్రీ కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు వారికి, వారి కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా ఉండాలని కోరారు ఈ కార్యక్రమంలో పాశం వెంకటేష్, పాశం తిరుపతయ్య, గోపి, కమల్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

# తాను ఎక్కడున్నా జన్మనిచ్చిన నెల్లూరు అంటే ప్రత్యేక అభిమానం

## - సన్మానం సభలో నానో శాస్త్రవేత్త డాక్టర్ వరదరాజులు




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** తాను ఎక్కడున్నా తనకు జన్మనిచ్చిన నెల్లూరు అంటే ప్రత్యేక అభిమానం అని, నెల్లూరుకు చెందిన విశ్రాంత ప్రొఫెసర్, శాస్త్రవేత్త డాక్టర్ అనుముకొండ వరద రాజు అన్నారు. నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అరుదైన గౌరవాన్ని అందుకో వడం నెల్లూరు జిల్లాకు ఎంతో గర్వకారణమని అన్నారు. శుక్రవారం ఉదయం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన ఆత్మీయ అభినందన సభలో నెల్లూరు నవాబుపేట నివాసి, శాస్త్రవేత్త వరదరాజులుని జాయింట్ కలెక్టర్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అమెరికాలోని ప్రతిష్టాత్మక స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం ప్రకటించే ప్రపంచంలోని టాప్ 2 శాతం శాస్త్రవేత్తల జాబితాలో నెల్లూరు వాసి వరదరాజులు వరుసగా ఐదు సంవత్సరాలు (2021--2025) స్థానం సంపాదించడం నెల్లూరు జిల్లాకు ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. 75 ఏళ్ల వయసులో కూడా నిరంతర పరిశోధనలతో ముందుకు సాగుతూ శాస్త్రరంగంలో విశేష కృషి చేయడం యువతకు ఆదర్శమని అన్నారు. పర్యావరణ అనుకూల నానో-కాంపోజిట్లు, నానో-మెడిసిన్ రంగాల్లో డాక్టర్ వరద రాజులు చేసిన పరిశోధనలు అంతర్జాతీయ గుర్తింపు పొందాయని, ఆయన కృషికి అనేక భారతీయ మరియు అంతర్జాతీయ పేటెంట్లు లభించడం రాష్ట్రానికి గౌరవకారణమని పేర్కొన్నారు. పసుపు, గోమూత్రం వంటి సహజ పదార్థాలతో అభివృ ద్ధి చేసిన యాంటీ-బాక్టీరియల్ నానో-కాంపోజిట్లు ఆసుపత్రి వినియో గానికి అనువుగా ఉండి, బ్యాక్టీరియా సంక్రమణలను తగ్గించడంలో సహాయపడుతున్నాయని తెలిపారు. ఈ పరిశోధనలకు భారత ప్రభుత్వం నుండి అనేక పేటెంట్లు, థాయ్‌లాండ్‌లో రెండు పేటెంట్లు లభించడం విశేషమన్నారు. అంతర్జాతీయ జర్నల్స్‌లో 250కి పైగా పరిశోధనా పత్రాలను ప్రచురించి, బీజింగ్‌లోని చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో అనేక సార్లు పరిశోధనల్లో పాల్గొనడం, థాయ్‌లాండ్‌లోని కింగ్ మాంగ్‌కుట్ విశ్వవిద్యాలయంలో బోధన అందించడం ఆయన ప్రతిభకు నిదర్శనమని తెలిపారు. గతంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకోవడంతో కూడా ఆయన సేవలను ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. ఇటీవల అభివృద్ధి చేసిన పసుపు ఆధారిత నానో-కాంపోజిట్ ప్రయోగశాల స్థాయిలో క్యాన్సర్ కణాలను తగ్గించే సామర్థ్యం చూపడం వైద్యరంగానికి ఆశాజనకమని పేర్కొన్నారు. ఈ ఆవిష్కరణకు భారత ప్రభుత్వ పేటెంట్ లభించగా, భవిష్యత్తులో క్లినికల్ ట్రయల్స్ నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. నానో శాస్త్రవేత్త డాక్టర్ వరదరాజులు మాట్లాడుతూ తాను ఎక్కడున్నా తనకు జన్మనిచ్చిన నెల్లూరు అంటే ప్రత్యేక అభిమానం అని, జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్ల ప్రత్యేకంగా మళ్లీ తనను నెల్లూరుకు పిలిపించి సత్కరించడం మనసుకు చాలా సంతృప్తిగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. నెల్లూరులో ప్రాథమిక విద్య పూర్తి చేసి, వి.ఆర్.కళాశాలలో ఉన్నత విద్యను అభ్యసించి, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి పిహెచ్‌డీ పొందినట్లు చెప్పారు. 1950 నుంచి 1972 మధ్యకాలంలో నెల్లూరులో తన విద్యాభ్యాసం పూర్తి చేసినట్లు చెప్పారు. అనంతపురంలోని శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడిగా, పరిశోధకుడిగా సేవలందించి 2010లో పదవీ విరమణ పొందినట్లు తెలిపారు. పదవీ విరమణను ముగింపుగా కాకుండా కొత్త ఆరంభంగా భావించి, పర్యావరణానికి అనుకూలమైన ప్లాస్టిక్‌లు, సాంప్రదాయ భారతీయ పదార్థాలను ఆధునిక నానో-కాంపోజిట్లుగా అభివృద్ధి చేయడంపై పరిశోధనలు చేస్తున్నట్లు చెప్పారు. వైద్యరంగంలో నానోపార్టికల్స్ అధిక ఉపరితల వైశాల్యం వల్ల తక్కువ మోతాదులోనే ఎక్కువ ఔషధ ప్రభావం సాధ్యమవుతుందని, దుష్ప్రభావాలు తగ్గించే అవకాశముందని వివరించారు. తనను నెల్లూరుకి ప్రత్యేకంగా ఆహ్వానించిన జిల్లా కలెక్టర్, జిల్లా అధికార యంత్రాంగానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తన పరిశోధనలకు అంతర్జాతీయ స్థాయిలో లభించిన గుర్తింపును నెల్లూరు ప్రజలకు అంకితం చేస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా చెప్పారు. ఇందుకు సంబంధించిన పత్రాలను జాయింట్ కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయ్ కుమార్, పలువురు జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా నారాయణ ఈ-చాంప్స్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు బాలాజీ నగర్‌లోని నారాయణ ఒలింపియాడ్ స్కూల్‌లో ఈ-చాంప్స్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమం చిన్నారుల విద్యా ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో చిన్నారులు సంప్రదాయబద్ధంగా ప్రాసెషన్‌తో వేదికపైకి వచ్చి, గ్రాడ్యుయేషన్ కేప్స్ ధరించి పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా బ్రాంచ్ ప్రిన్సిపాల్ వందన మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి నారాయణ విద్యా సంస్థలు ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు. ఏజీఎం శ్రీధర్, ఆర్‌ఐ ఆది శేషయ్య విద్యార్థుల క్రమశిక్షణ, ప్రతిభను అభినందించారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా సమన్వయం చేసిన కోఆర్డినేటర్ శాంతి, వైస్ ప్రిన్సిపాల్ అనుష ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది అందరి సహకారంతో ఈ వేడుకలు



విజయవంతంగా నిర్వహించబడ్డాయి. చివరగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి చిన్నారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ కార్యక్రమం ముగిసింది.

# ఎర్రచందనం స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష - రూ.6 లక్షల జరిమానా

## - ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి తీర్పు

**తిరుపతి, (రాజధాని వార్తలు):** ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 6 లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం కఠిన చర్యలు అమలు చేస్తోంది. ఆర్ఎస్ఎఎస్టీఎఫ్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్‌ఫోర్సు ఎస్పీ జె.కులశేఖర్ పర్యవేక్షణలో గతంలో నమోదయ్యి, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అలుగూరి అమర నారాయణ ద్వారా పగడ్బం దీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రైమ్ నెంబరు 21/2017 కేసులో ఈ ముద్దాయి తిరుపతి జిల్లా నాగపట్ల ఈస్ట్ ఫారెస్ట్ బీటు, చామల సెక్షన్ అటవీ పరిధిలో అరెస్టయ్యాడు. ఈ వ్యక్తి తమిళనాడు, తిరువన్నామలై జిల్లాకు చెందిన ఆర్ రామ రాజన్, కాగా ఇతని నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 6లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.



తదుపరి కోర్టు ఆదేశాలు మేరకు అతనిని నెల్లూరు సెంట్రల్ జైలులో అప్పగించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ లోని శేషా చలం రిజర్వు ఫారెస్టులోని అతి విలువైన సహజ సంపద ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడం, అడవిలోకి అక్రమంగా ప్రవేశించే నేరస్తులకు ఇది హెచ్చరికగా పరిగణించబడుతుందని టాస్క్‌ఫోర్సు ఎస్పీ కులశేఖర్ తెలిపారు. ముద్దాయిలకు శిక్షలు పడేలా సహకరిస్తున్న కోర్టు సిబ్బందిని ఆయన అభినందించారు.

# సంపాదకీయం

## పూలే వికసిత భారత్‌కు దారిదీపం

ఏప్రిల్ 11 నేడు. మనందరికీ చాలా ప్రత్యేకమైన రోజు. భారతదేశపు అగ్రశ్రేణి సంఘ సంస్కర్తల్లో ఒకరు, తరతరాలకూ మార్గదర్శిగా నిలిచిన క్రాంతిపథగామి మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి నేడు. ఆయన ద్విశతాబ్ది జయంత్యుత్సవాల ప్రారంభం నేపథ్యంలో, ఈ ఏడాది మరింత విశిష్టతను సంతరించుకున్నది. మహాత్మా పూలే గొప్ప సంఘసంస్కర్త. అంతేకాదు.. నైతిక స్థైర్యం, నిరంతర సత్యాన్వేషణ, సామాజిక శ్రేయస్సు పట్ల అచంచలమైన అంకితభావం కలబోసిన ఉదాత్త జీవితం ఆయనది. ఎన్నో సంస్థలను నెలకొల్పి, ఎన్నో ఉద్యమాలకు సారథ్యం వహించి చిరస్మరణీయులయ్యారు పూలే. ఆయన రేకెత్తించిన సరికొత్త ఆశలు, దేశ ప్రజల్లో నింపిన ఆత్మవిశ్వాసం, మన నాగరికతా పరిణామక్రమంలో ఆయన చేసిన అసమానమైన సేవలూ... నేటికీ లక్షలాది మందికి స్ఫూర్తిని అందిస్తున్నాయి. పుణ్యభూమి మహారాష్ట్రలో 1827లో మహాత్మా పూలే జన్మించారు. అతి సామాన్య నేపథ్యం నుంచి ఎదిగారాయన. కానీ తొలినాటి కష్టాలేవీ ఆయన అభ్యాసానికీ, ధైర్యానికీ, సామాజిక నిబద్ధతకూ అడ్డుగోడలు కాలేకపోయాయి. సవాళ్లు ఏవైనా సరే-నిశ్చేష్టులుగా ఉండిపోకుండా.. కష్టపడి జ్ఞానాన్ని ఆర్జించి, ఆ సమస్యలను పరిష్కరించుకోవాలన్న దృఢ సంకల్పమే ఆయనలో ఎన్నడూ తొణికిసలాడేది. విద్యార్థి దశ నుంచే జ్యోతిరావు పూలేలో అపారమైన జిజ్ఞాస ఉండేది. నిరంతర అధ్యయనశీలి. తన వయసు పిల్లల స్థాయికి మించిన పుస్తకాలను చదివేవాడు. "మనం ఎంత ప్రశ్నిస్తే అంత జ్ఞానాన్ని పొందుతాం" అని తర్వాతి కాలంలో ఆయనే చెప్పారు. చిన్ననాటి నుంచే ఆయనకు అలవడిన ఆ సత్యాన్వేషణ దృక్పథం ఎక్కడా రాజీ పడకుండా జీవితాంతమూ కొనసాగింది. విద్యనూ, జ్ఞాన సముపార్జననూ జీవిత లక్ష్యాలుగా మలచుకున్నారు మహాత్మా పూలే. జ్ఞానం కొందరి గుత్తాధిపత్యం కాదనీ, ఆ శక్తి అందరికీ అందాలనీ స్పష్టంగా గుర్తించారాయన. సమాజంలో అనేకులకు అక్షర జ్ఞానం అందని ద్రాక్షగా ఉన్న ఆ కాలంలోనే బాలికల కోసం, విద్యావకాశాలు లేని వర్గాల కోసం పాఠశాలలను తెరిచి విద్యా విప్లవానికి నాంది పలికారు. "తల్లి ద్వారా బిడ్డకు అందే సంస్కారం అమూల్యమైనది. అందుకే, పాఠశాలలు తెరవాలనుకుంటే మొదట బాలికల కోసమే తెరవాలి" అనేవారాయన. సామాజిక న్యాయాన్నీ, సమానత్వాన్నీ సాధించే శక్తిమంతమైన సాధనంగా తరగతి గదిని నిలిపి.. ఓ సరికొత్త సామాజిక దృక్పథాన్ని ఆవిష్కరించేందుకు ఆయన ఎంతగానో కృషి చేశారు. విద్య పట్ల ఆయన దార్శనికత మనందరికీ స్ఫూర్తిదాయకం. దేశ యువతలో పరిశోధన, ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యంగా గత పదేళ్లుగా మేమెంతో కృషి చేశాం. ప్రశ్నించేలా, అన్వేషించేలా, నూతన ఆవిష్కరణలు చేసేలా యువతరాన్ని ప్రోత్సహించే పటిష్ఠమైన వ్యవస్థను నిర్మిస్తున్నాం. విజ్ఞానం, నైపుణ్యాలు, అవకాశాల్లో పెట్టుబడుల ద్వారా.. సమస్యల పరిష్కర్తలుగా, దేశ ప్రగతికి సారథులుగా భారత్ తన యువతను సశక్తులుగా తీర్చిదిద్దుతోంది. మహాత్మా పూలే తన విజ్ఞానంతో, వివేకంతో... వ్యవసాయం, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి వంటి రంగాలపై విస్తృత అవగాహనను పెంపొందించుకున్నారు. రైతులు, కార్మికులకు అన్యాయం జరిగితే మన సమాజం బలహీన పడుతుందని ఆయనెప్పుడూ చెప్పేవారు. పొలాల నుంచి పల??లెల దాకా.. రోజువారీ జీవితంలో సామాజిక అసమానతల తీవ్రతను ఆయన నిశితంగా గమనించారు. అందుకే పేదలు, అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని కాపాడడంలో ఆయన పూర్తిగా నిమగ్నమయ్యారు. అలాగే సామాజిక సామరస్యం కోసం శక్తివంచన లేకుండా నిర్విరామంగా కృషి చేశారు. "జోపర్యంత సమాజాతీల సర్వానా సమాన అధికార మిళత్ నహీత్, తోపర్యంత ఖరే స్వతంత్ర్య మిళత్ నహీ (సమాజంలోని ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించేంత వరకు నిజమైన స్వేచ్ఛను సాధించలేము)" అన్నది మహాత్మా పూలే అభిప్రాయం. సమ సమాజం లక్ష్యంగా.. ఈ ఆశయాన్ని కార్యాచరణగా మలిచే దిశగా ఎన్నో సంస్థలను ఆయన నెలకొల్పారు. ఆయన స్థాపించిన సత్యశోధక సమాజం ఆధునిక భారతదేశంలో అత్యంత ముఖ్యమైన సామాజిక సంస్కరణ ఉద్యమాల్లో ఒకటి. సామాజిక సంస్కరణ, సమాజ సేవ, మానవ గౌరవాన్ని పెంపొందించడంలో ఇది అగ్రగామిగా నిలిచింది. మహిళలు, యువత, గ్రామీణ ప్రజలకు గొంతుకైంది. న్యాయం, ప్రతి వ్యక్తికీ గౌరవం, సమష్టి పురోగతి స్ఫూర్తిని కేంద్రంగా నిలపడం ద్వారా.. సమాజాన్ని శక్తిమంతంగా తీర్చిదిద్దవచ్చన్న మహాత్మా పూలే విశ్వాసానికి ఈ ఉద్యమం నిదర్శనం. ఆయన వ్యక్తిగత జీవితమూ ధైర్యసాహసాలను బోధించే పాఠమే. నిరంతరం జనబాహుళ్యంలో ఉంటూ ప్రజల కోసం పరితపించడం ఆయన ఆరోగ్యంపై ప్రభావం చూపింది. అత్యంత క్లిష్టమైన అనారోగ్య సమస్యలు కూడా ఆయన సంకల్పాన్ని సడలించలేకపోయాయి. పక్షవాతం బారిన పడి శరీరం సహకరించని స్థితిలోనూ తన కృషిని కొనసాగించారు. అవును, ఆయన శరీరం కఠిన పరీక్షను ఎదుర్కొని ఉండవచ్చు.. కానీ సమాజం పట్ల ఆయన నిబద్ధత మాత్రం సడలలేదు. ఆయన జీవితంలోని ఈ అకుంఠిత దీక్షే.. నేడు ఎన్నో కష్టాలకోర్చి, పోరాటాన్ని కొనసాగిస్తున్న లక్షలాది మందికి స్ఫూర్తినిస్తోంది. గౌరవ సావిత్రీబాయి పూలేను స్మరించుకోకుండా మహాత్మా జ్యోతిరావు పూలే స్మృతి అసంపూర్ణమే అవుతుంది. దేశం గర్వించదగ్గ అగ్రశ్రేణి సంస్కర్తల్లో ఆమె ముందు వరుసలో నిలుస్తారు. దేశపు తొలితరం మహిళా ఉపాధ్యాయినిగా, బాలికా విద్యా వికాసంలో ఆమె నిర్ణయాత్మక పాత్ర పోషించారు. తద్వారా వారు కలలను సాకారం చేసుకునే అవకాశాన్నిచ్చారు. మహాత్మా పూలే మరణానంతరమూ.. ఆ ఆశయ దీప్తిని సావిత్రీబాయి ఆరనివ్వలేదు. 1897లో ప్లేగు వ్యాధి విరుచుకుపడిన తరుణంలో.. బాధితుల సేవలో ఆమె పునరంకితమయ్యారు. చివరకు అదే వ్యాధికి గురై ప్రాణాలు విడిచిన త్యాగమూర్తి ఆమె.

# విద్యార్థులతోనే నవ సమాజ ప్రగతి

### - సామాజిక సేవలకు ప్రతిరూపం గంట్ల - ఏ యు తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య జెర్ర అప్పారావు





**విశాఖ, (రాజధాని వార్తలు):** విద్యార్థుల వినూత్న ఆలోచనాశక్తి నూతన ఆవిష్కరణలు భవిష్యత్ తరాలకు బాటలు వేస్తాయని ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం అధ్యక్షులు ఆచార్య జెర్ర అప్పారావు అన్నారు. శుక్రవారం తెలుగు విభాగంలో పరిశోధకులు విద్యార్థులతో ఆయన ప్రత్యే కంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మాట్లాడుతూ నవ సమాజ ప్రగతిలో విద్యార్థులదే కీలకపాత్ర అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ ఉన్నత ఆలోచనలతో ముందుకు సాగుతూ అందుకు తగ్గట్టుగానే తమకు నచ్చిన విధంగా విద్యాభ్యాసం కొనసాగించాలన్నారు. విద్యార్థులు కోరుకున్న రంగంలో రాణించేందుకు అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. అయితే వాటిని ఎప్పటికప్పుడు సరికొత్త మార్పులతో అంది పుచ్చుకోవాలన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ తెలుగు విభాగం విద్యార్థులు అత్యధిక శాతం ఇటీవల ఉద్యోగాలు పొంది యూనివర్సిటీతో పాటు వారి తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచారన్నారు. అలాగే నెట్ జెఆర్ఎఫ్‌తో పాటు అనేక పరీక్షల్లో మెరుగైన ప్రతిభను కనబరిచి ఎంతోమంది ప్రభుత్వం ద్వారా స్కాలర్‌షిప్‌లు పొంది తల్లిదండ్రులకు భారం కాకుండా తమ కష్టంతోనే చదువుకున్న విద్యార్థులు అనేకమంది ఉన్నారన్నారు.

**సామాజిక సేవలకు ప్రతిరూపం గంట్ల**

జర్నలిజంతో పాటు సామాజిక సేవా రంగంలోనూ గంట్ల శ్రీను బాబు అందిస్తున్న సేవలు అత్యంత ప్రశంసనీయమని ఆచార్య జెర్ర అప్పారావు కొనియాడారు. తన మూడో పీజీగా ఎంఏ తెలుగు పూర్తి చేసిన గంట్లకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారం అందజేసింది. అలాగే విశ్వగురుతో పాటు మరిన్ని పురస్కారాలు గంట్ల స్వీకరించారు. ఈ సందర్భంగా ఆచార్య అప్పారావు పరిశోధకులు విద్యార్థుల సమక్షంలో ఘనంగా గంట్ల శ్రీను బాబును సత్కరించి అభినందించారు. భవిష్యత్తులో మరింతగా సేవలందించాలని పలువురికి ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

# వాడబలిజల దుర్గాలమ్మ జాతరకు వాసుపల్లి రూ. 50,000లు విరాళం

### - అమ్మదయ ఉంటే అన్ని ఉన్నట్టే - 34వ వార్డులో 14, 15, 16వ తేదీల్లో జాతర
### - మాజీ ఎమ్మెల్యే గణేష్ కుమార్‌కి ఆహ్వాన పత్రిక అందజేసిన కమిటీ సభ్యులు




**విశాఖ, (రాజధాని వార్తలు):** దక్షిణ నియోజక వర్గం కొబ్బరి తోట వీధి వాడబలిజి మత్స్యకార కులానికి చెందిన గ్రామ దేవత శ్రీ దుర్గాలమ్మ జాతర మహోత్సవానికి మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ 50,000/-లు విరాళం అందజేశారు. ఆశీలమెట్ట కార్యాలయంలో శుక్రవారం కమిటీ సభ్యులకు 50,000/-ల చెక్‌ను అందజేశారు. ప్రతి ఏడాది మాదిరిగా ఉత్సవాలకు సహాయ సహకారాలు అందిస్తున్న వాసుపల్లి గణేష్ కుమార్ ఆయురా రోగ్యాలతో అష్టైశ్వర్యాలతో మళ్లీ తమ నాయకుడిగా అధికారం లోకి వచ్చి సేవలు విస్తృతం చేయాలని అమ్మవారిని ఆరాధిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 14, 15, 16వ తేదీల్లో జరగనున్న జాతర మహోత్సవానికి వాసుపల్లి గణేష్ కుమార్ ని సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వాసుపల్లి మాట్లాడుతూ వాడబలిజి కులానికి చెందిన గ్రామ దేవతగా విరాజిల్లుతున్న శ్రీ దుర్గాలమ్మవారు జాతర విజయవంతంగా జరగాలని ఆకాంక్షించారు. అమ్మవారి చల్లని ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఉండాలన్నారు. తమ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రజలకు సేవ చేసే భాగ్యం మళ్లీఅమ్మవారు అందిస్తారని ఆకాంక్షించారు. ఇక్కడి అమ్మవారు ఎంతో ప్రతిష్ట చెందారని, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా తమ వాడ బలిజిల ఆరాధ్య దైవంగా ప్రతి ఏటా తీర్థ మహోత్సవం అంగరంగ వైభవంగా కమిటీ సభ్యులు నిర్వహిస్తారని, అదే మాదిరిగా ఈ ఏడాది కూడా విజయవంతం కావాలని వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దాసరి ఎల్లయ్య, వాసుపల్లి ఎల్లరారావు, వాసుపల్లి దానయ్య, గరికిన కొండబాబు, కెవిఎన్ రాజు, సూరడా రాంబాబు, మెరుగు ఎలాజి స్టేట్ నాయకులు లింగం శ్రీను, లండ రమణ, జిల్లా నాయకులు వాసుపల్లి ధనరాజు, కడవల నాగమణి, వార్డ్ నాయకులు గాలి పార్వతి, సిహెచ్. జ్యోతి, సూరడా లక్ష్మణ్, కమిటీ సభ్యులు వారణాయలు పాల్గొన్నారు.

# ఉత్తర నియోజకవర్గం అసెంబ్లీ బడ్జెట్ అవుట్ రీచ్ కార్యక్రమం

### - కార్యక్రమానికి అధ్యక్షత వహించిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రవీణ, జోనల్ కమిషనర్ రాము





**విశాఖ, (రాజధాని వార్తలు):** ఉత్తర నియోజకవర్గంలో 2025-2026 సంవత్సరానికి సంబంధించిన అసెంబ్లీ బడ్జెట్ అవుట్‌రీచ్ కార్యక్రమం, ఎమ్మెల్యే మరియు బీజేపీ ఫ్లోర్ లీడర్ పి. విష్ణుకుమార్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రవీణ, జోనల్ కమిషనర్ రాము అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ, ఉత్తర నియోజకవర్గంలో ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులు మరియు భవిష్యత్తులో అమలు చేయనున్న కార్యక్రమాలపై అధికారులతో, నాయకులతో సమగ్రంగా చర్చించారు. అలాగే, నియోజకవర్గంలోని అన్ని విభాగాలపై సమీక్ష నిర్వహించి, కొత్తగా కేటాయించిన బడ్జెట్ నిధుల వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఆరోగ్యం, పారిశుధ్యం, తాగునీరు వంటి అంశాలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఇంకా, నియోజకవర్గంలో కొండ ప్రాంతాలు ఎక్కువగా ఉండటంతో, ఏవైనా సమస్యలు ఉంటే వాటిని లిఖితపూర్వకంగా కార్యాలయానికి సమర్పించాలని నాయకులు మరియు ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్, ఉత్తర నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి ఉషా కిరణ్, జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ బాబు, అలాగే పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, వార్డు అధ్యక్షులు, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

# రుణాలు సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట మండలంలో డిఆర్డిఏ, వెలుగు ఆధ్వర్యంలో "పీఎం అజయ్" పథకంలో భాగంగా ఆరుగురు ఎస్సీ లబ్ధిదారులకి జీవనోపాధి యూనిట్‌ల రుణాలను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అందజేశారు. శుక్రవారం ఏపీఎం జగదీశ్వరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చినరాజప్ప ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లక్ష రూపాయల యూనిట్ కాస్ట్‌లో నిమిత్తం రూ. 50 వేలు సబ్సిడీ, రూ. 10 వేలు లబ్ధిదారులు వాటా కాగా రూ. 40 వేలు సున్నా వడ్డీ ఋణంగా అంది స్తున్నట్టు ఏపిఎం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సబ్సిడీ రుణాలను మహిళలు పొందడం ద్వారా వారు వ్యాపారాలను వృద్ధి చేసుకొని, స్వయం ఉపాధి పొంది జీవితంలో స్థిరపడాలన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు రుణాల చెక్కులను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# వేసవి దాహార్తికి చలివేంద్రాలు అవసరం



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ప్రజలు, ప్రయాణీకుల దాహార్తి తీర్చేందుకు చలి వేంద్రాలు అవసర పడతాయని కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. శుక్రవారం సామర్లకోట పట్టణ పరిధిలోని లారీ స్టాండ్ వద్ద మైత్రి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా మైత్రి సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం వేసవి కాలంలో దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం చాలా సంతోషమని, స్వచ్ఛంద సేవా సంస్థలు వేసవికాలంలో వాహనదారులకు, బాటసారులకు ఎండ తీవ్రత వల్ల దాహం వేసే క్రమంలో ప్రతి ఒక్కరూ చలివేంద్రాలు ఏర్పాటు చేసి వారి దాహార్తి తీర్చేందుకు కృషి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మైత్రి సేవా సంఘ ప్రెసిడెంట్ తలారి వరహాలు, సెక్రెటరీ లోవరాజ్, జనరల్ సెక్రెటరీ పుట్టా కొండలరావు, గౌరవ అధ్యక్షులు సత్యనారాయణ, సమన్వయకర్త మంచెం సాయిబాబు, పిట్టా జానకి రామారావు, మడగల శ్యామ్, కుమార్, రాజాల శ్రీను, సుధాకర్ పాల్గొన్నారు.

# ఏబీఎన్ రాధాకృష్ణపై వైఎస్ఆర్ సీపీ పోలీసులకు ఫిర్యాదు

### - మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై పట్టణ సిఐకు ఫిర్యాదు

**అమలాపురం, (రాజధాని వార్తలు):** మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఏబీఎన్ రాధాకృష్ణపై కఠిన చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అమలాపురం నియోజకవర్గం కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు శుక్రవారం బట్నవెల్లిలోని మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ నివాసం నుండి ర్యాలీగా బయలుదేరి అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఏబీఎన్ రాధాకృష్ణ తీరును నిరసిస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్రికా రంగంలో ఉన్న వేమూరి రాధాకృష్ణ విజ్ఞత లేకుండా మహిళల ఆత్మగౌరవం దెబ్బతినేలా మాట్లా డితే సహించేది లేదు పినిపే శ్రీకాంత్ హెచ్చరించారు. మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడిన ఏబీఎన్ రాధాకృష్ణపై కేసు నమోదు చేసి, చట్టపరంగా శిక్షించాలని కోరారు. ఎన్నో ఏళ్లగా మీడియా రంగంలో ఉంటూ సామాజిక బాధ్యత మర్చిపోయి మహిళలను కించపరచడం దుర్మార్గమని శ్రీకాంత్ ధ్వజమెత్తారు. చేసిన తప్పును ఒప్పుకుంటూ రాధాకృష్ణ వెంటనే మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాధాకృష్ణపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ వీరబాబుకు పార్టీ శ్రేణులతో కలిసి ఫిర్యాదు చేశారు. మహిళల మనోభావాలను దెబ్బతీసేలా అసభ్యకరంగా, అవమానకరంగా వార్తలు ప్రసారం చేసి ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే విధంగా వ్యవహరించిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణపై ఛానల్ ప్రతినిధులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అమలా పురం మాజీ ఎంపీ చింతా అనురాధ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడిపూడి సూర్యనారాయణ, చెల్లుబోయిన శ్రీను, రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షులు జిన్నూరి బాబీ, జడ్పీటీసీ పందిరి శ్రీహరి, ఖాదర్, రెడ్డి సత్య నాగేంద్రమణి, గుత్తుల చిరంజీవి, ఇళ్ల శేషారావు, కుడిపూడి భరత్, వంగా గిరిజ కుమారి, గువ్వల రాజేష్, సంసాని నాని, మట్టపర్తి నాగేంద్ర, సుధా గణపతి, సుంకర లక్ష్మి, బద్రి బాబ్జీ, గుత్తుల చిరంజీవి, ఎంపీపీ ఇళ్ల శేషారావు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ రెడ్డి సత్యనాగేంద్ర మణి తదితరులు పాల్గొన్నారు.

# ఆ స్టార్ హీరోకి జోడీగా సాహో బ్యూటీ!



బాలీవుడ్‌లో విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరో విక్కీ కౌశల్. ప్రస్తుతం ఆయన అమర్ అశ్వత్థామ వంటి పౌరాణిక చారిత్రక నేపథ్యం ఉన్న చిత్రాలపై దృష్టి సారించారు. ఈ క్రమంలోనే మహావతార్ అనే భారీ ప్రాజెక్టును పట్టాలెక్కించబోతున్నారు. ఈ సినిమాలో విక్కీ కౌశల్ సరసన నటించేందుకు శ్రద్ధా కపూర్‌తో చిత్ర బృందం సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. ఈ ప్రచారంతో అభిమానుల్లో సరికొత్త కాంబినేషన్ పై ఆసక్తి నెలకొంది. ఇప్పటి వరకూ విక్కీ కౌశల్ శ్రద్ధా కపూర్ ఇంతవరకు వెండితెరపై కలిసి నటించలేదు. ఇద్దరూ తమదైన శైలిలో నటనను పండించగల ప్రతిభావంతులు. సాహో చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు కూడా దగ్గరైన శ్రద్ధ గ్లామర్ పాత్రలతో పాటు నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను చేయడంలో దిట్ట. విక్కీ కౌశల్ పీరియాడిక్ లుక్స్‌లో పరకాయ ప్రవేశం చేస్తారనే పేరుంది. ఈ నేపథ్యంలో ఇద్దరూ ఒకే ఫ్రేమ్‌లో కనిపిస్తే ఆ కెమిస్ట్రీ వెండితెరపై అద్భుతమైన మ్యాజిక్‌ను క్రియేట్ చేయడానికి అవకాశం ఉంది. మహావతార్ చిత్రం భారీ బడ్జెట్‌తో, ఉన్నత సాంకేతిక విలువలతో రూపొందుతోంది. ఇదొక చారిత్రక నేపథ్యం ఉన్న కథ కావడంతో పాత్రల ఎంపిక విషయంలో దర్శకుడు చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. శ్రద్ధా కపూర్ తనదైన రాజసంతో ఈ చిత్రంలోని పాత్రకు పూర్తి న్యాయం చేస్తుందని భావించి ఆమెను సంప్ర దించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రాథమిక చర్చలు ముగిశాయని త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని బాలీవుడ్ వర్గాల సమాచారం. సాధారణంగా పెద్ద సినిమాల్లో కొత్త కాంబినేషన్లు ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. రొటీన్ జంటల కంటే ఎప్పుడూ చూడని నటీనటులు కలిసి నటిస్తే ఆ సినిమాకు వచ్చే క్రేజ్ వేరుగా ఉంటుంది. విక్కీ కౌశల్ సీరియస్ పర్ఫార్మెన్స్‌కు శ్రద్ధా కపూర్ చరిష్మా తోడైతే అది సినిమాకు విజువల్ పరంగా, మార్కెట్ పరంగా ప్లస్ అవుతుంది. ఈ ప్రాజెక్ట్ ఖరారైతే ఏడాది బాలీవుడ్ నుండి రాబోయే క్రేజీ చిత్రాలలో ఇదొకటిగా నిలుస్తుంది. మహావతార్ చిత్రం విక్కీ - శ్రద్ధా కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచే అవకాశం ఉంది.

కొత్త కాంబినేషన్లను ఇష్టపడే ప్రేక్షకులకు చిత్రం ఒక విందులా మారుతుంది. పర్ఫెక్ట్ కాస్టింగ్ కుదిరినప్పుడే సగం విజయం లభిస్తుందని నమ్మే మేకర్స్ ఈ జోడీని వెండితెరపై ఎలా ఆవిష్కరిస్తారో చూడాలి. శ్రద్ధా కపూర్ సైతం ఈ ప్రాజెక్ట్ పట్ల సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. అమ్మడు రెండేళ్లగా ఎలాంటి సినిమాలు చేయని సంగతి తెలిసిందే. భారీ విజయాలు అందుకున్న నేపథ్యంలో కథల విషయంలో ఆచితూచి అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో మహావతార్ లాంటి ప్రాజెక్ట్‌లో ఛాన్స్ ఖరారైతే తాను అనుకున్నది సాధించినట్లే.

# ఒకరితోనే డేటింగ్ అతడితోనే పెళ్లి!



మాత్రం పాత తరం విలువలకే ప్రాధాన్యత ఇస్తానని చెప్పుకొచ్చింది. తాను ఎవరితోనైనా డేటింగ్ చేస్తే అది కేవలం పెళ్లి కోసమే ఉంటుందని ఒకరితోనే ప్రేమ.. అతడితోనే జీవితం అనే సూత్రాన్ని తాను నమ్ముతానని వెల్లడించింది. ఈ వ్యాఖ్యలు ఆమెలోని పరిణతిని, సంప్ర దాయాల పట్ల ఉన్న గౌరవాన్ని చాటుతున్నాయి. ప్రేమ, పెళ్లి విషయంలో కృతి శెట్టికి ఒక నిర్దిష్టమైన ప్రణాళిక ఉన్నట్లు కనిపిస్తుందని ఆమె మాటలతో అర్దమవుతుంది. ప్రస్తుతానికి కృతిశెట్టి దృష్టి సినిమాలపైనే ఉందని మరో ఐదేళ్ల వరకు ప్రేమ లేదా పెళ్లి అనే ఆలోచనే తన దరిదాపుల్లోకి రాదని స్పష్టం చేసింది. ఐదేళ్ల తర్వాత మాత్రమే తన వ్యక్తిగత జీవితం గురించి ఒక నిర్ణయం తీసుకుంటానని అప్పటి వరకు తన శక్తిని, సమయాన్ని నటనకే కేటాయిస్తానని పేర్కొంది. ప్రేమ అనేది ఒక బాధ్యత అని సరదా కోసం చేసే పని కాదని కృతి అభిప్రాయపడింది. తాను పెళ్లాడబోయే వ్యక్తి తనను అర్థం చేసుకునేవాడై, తన వృత్తిని గౌరవించే వాడై ఉండాలంది. డేటింగ్ పేరుతో సమయాన్ని వృధా చేయడం కంటే ఒకే వ్యక్తితో బలమైన ఇలాంటి స్పష్టత ఉండటం వల్ల వృత్తిపరంగా ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను చేరుకునే అవకాశం ఉంది. చాలామంది నటీమణులు కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడు రూమర్ల బారిన పడుతుంటారు. అయితే కృతి శెట్టి ముందే ఇలాంటి ప్రకటన చేయడం ద్వారా అనవసరమైన గాసిప్స్‌కు చెక్ పెట్టినట్లయింది. తెలుగుతో పాటు తమిళం, మలయాళం భాషల్లోనూ అవకాశాలు దక్కించుకుంటున్న మంగళూరు భామ నటనతో ప్రేక్షకులను మెప్పించడమే పరమావధిగా భావిస్తుంది. కృతి శెట్టి కెరీర్‌పై ఉన్న స్పష్టతతో ఇటు నిర్మాతలకు, అటు అభిమానులకు ఒకరకమైన భరోసా ఇచ్చినట్లే. ఐదేళ్ల పాటు కేవలం వెండితెరపైనే కనిపిస్తానని చెప్పడం ఆమె అంకితభావాన్ని సూచిస్తోంది. దీంతో నిర్మాతలు నిశ్చింతగా సినిమాలు చేసుకోవచ్చు. కృతిశెట్టి ఫాలోవర్స్ అమ్మడి కోస ప్రయత్నాలు చేయొచ్చు. ఈ బ్యూటీ నటించిన ఎల్ ఐ కె సినిమా కొన్ని గంటల క్రితమే రిలీజ్ అయిన సంగతి తెలిసిందే. ఈ సినిమా విజయంపై అమ్మడు చాలా ఆశలే పెట్టుకుంది. అలాగే తెలుగులోనూ ఓ అగ్ర హీరో ప్రాజెక్ట్‌కు సైన్ చేసింది.

# స్వర్గం కళ్ల ముందే బులుగు బికినీలో!






టాలీవుడ్ అందాల భామ ప్రగ్యా జైస్వాల్ ప్రస్తుతం మాల్దీవుల వెకేషన్‌లో విహరిస్తూ తన అభిమానులకు కనువిందు చేస్తోంది. నీలిరంగు బికినీలో సముద్రపు తీరాన దిగిన ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసిన ఈ భామ దీనికి అందమైన క్యాప్షన్ ఇచ్చింది. ప్యారడైజ్ నుంచి చివరి ఫోటో అంటూ క్యాప్షన్ ఇచ్చింది.

ఈ ఫోటోల్లో ప్రగ్యా తన గ్లామర్‌తో నెటిజన్లను కట్టిపడేస్తోంది. కేవలం విహార యాత్ర కోసమే కాకుండా.. అక్కడి రిసార్టులకు పెద్ద ఎత్తున ప్రమోషన్స్ చేస్తూ మాల్దీవుల పర్యాటకాన్ని తనదైన శైలిలో ప్రోత్సహిస్తోంది. కరోనా మహమ్మారి కారణంగా గత కొన్నేళ్లుగా కుదేలైన పర్యాటక రంగం.. ముఖ్యంగా మాల్దీవుల్లోని ఎగ్జోటిక్ రిసా ర్టులు ఇప్పుడు తిరిగి పుంజుకుంటున్నాయి. ప్రగ్యా వంటి సెలబ్రిటీలు చేసే ఇటువంటి ప్రమోషన్స్ వల్ల పర్యాటకుల తాకిడి పెరిగి అక్కడి హోటళ్లు, రిసార్టుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది.


# అతి ఫెమినిజం సమాజాన్ని పాడుచేసింది.. వివాదంపై నోరా క్లారిటీ



వరుస వివాదాల్లో నోరా ఫతేహి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఐటమ్ పాటల స్పెషలిస్ట్, డ్యాన్సింగ్ క్వీన్ నోరా ఫతేహి గతంలో ఫెమినిజం పై చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారాన్నే రేపాయి. అయితే ఇటీవల ఒక అంతర్జాతీయ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వివాదంపై పూర్తి స్థాయిలో క్లారిటీ ఇచ్చారు. తన మాటలను సోషల్ మీడియాలో చిన్న చిన్న క్లిప్పులుగా కత్తిరించి వక్రీకరించారని, దీనివల్ల తాను చెప్పదలుచుకున్న అసలు అర్థం మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ విషయంలోనైనా అతివాదాన్ని లేదా తీవ్రవాదాన్ని తాను వ్యతిరేకిస్తానని, తన పోరాటం మహిళా హక్కులకు వ్యతిరేకం కాదని నోరా స్పష్టం చేశారు. కుటుంబ వ్యవస్థ ప్రాధాన్యత గురించి మాట్లాడుతూ..నోరా తన వ్యక్తిగత జీవితంలోని భావోద్వేగాలను ప్రస్థావిస్తూ.. ఒక చిన్న కుటుంబంలో తల్లిదండ్రులిద్దరి సంరక్షణలో పెరగడం పిల్లల ఎదుగుదలకు ఎంతో కీలకమని అభిప్రాయపడ్డారు. తాను ఒక సింగిల్ మదర్ వద్ద పెరగడం వల్ల చిన్నతనంలో తండ్రి లేని లోటును అనుభవించానని.. అటువంటి భావోద్వేగ గాయాలు పెద్దయ్యాక కూడా వ్యక్తిత్వంపై ప్రభావం చూపుతాయని నిజాయితీగా అంగీకరించారు. అందుకే ప్రతి బిడ్డకు తల్లిదండ్రుల ప్రేమ, క్రమశిక్షణ అందాలని నోరా ఆకాంక్షించారు. మహిళా స్వయం ప్రతిపత్తి.. భాగస్వామ్యం మధ్య ఉండాల్సిన అండర్ స్టాండింగ్ గురించి నోరా కీలక వ్యాఖ్యలు చేశారు.

మహిళలు కచ్చితంగా ఆర్థికంగా స్వతంత్రంగా ఉండాలని.. వారి కలలను నెరవేర్చుకోవాలని కోరుకుంటూనే జీవితంలో ఒక తోడు ఉండటం తప్పేమీ కాదని అన్నారు. మాకు ఎవరి అవసరం లేదు అనే ధోరణి కంటే.. స్వతంత్రంగా ఉంటూనే ఒకరికొకరు తోడుగా ఉండటం గొప్ప విషయమని నోరా పేర్కొన్నారు. అలాగే సమాజంలో పురుషులు కూడా మరింత జవాబుదారీతనంతో మెదలాలని.. వారు బాధ్యతాయుతమైన భాగస్వాములుగా ఉండాలని సూచించారు. అతి ఫెమినిజాన్ని తాను సహించనని కూడా నోరా అన్నారు. అలాగే పురుషులు ఇంటిని పోషిస్తే, మహిళలు ఆ ఇంటిలో ఉంటూ సంరక్షించాలనే పురాతన విధానాన్ని తాను సమర్థిస్తానని వ్యాఖ్యానించారు. అలాగే మహిళలు మంచి ఉద్యోగం చేస్తూ ఇంటి బాధ్యతలు నిర్వర్తించాలని కూడా అన్నారు. అయితే ఫెమినిజానికి వ్యతిరేకంగా ఈ వ్యాఖ్యలు ఉన్నాయని కొందరు మహిళలు సోషల్ మీడియాల్లో విరుచుకుపడ్డ తర్వాత ఈ వివాదం రాజుకుంది. ప్రస్తుత కెరీర్ విషయానికి వస్తే.. నోరా అంతర్జాతీయ స్థాయిలో దూసుకుపోతున్నారు. ఇటీవల ఈ భామ విడుదల చేసిన వాట్ డు ఐ నో అనే సింగిల్ గ్లోబల్ చార్ట్స్‌లో ట్రెండ్ అవుతోంది. అంతేకాకుండా అమెరికాలోని ప్రసిద్ధ ది టునైట్ షో విత్ జిమ్మీ ఫాలన్‌లో ప్రదర్శన ఇచ్చి అంతర్జాతీయ గుర్తింపు పొందిన అతికొద్ది మంది భారతీయ తారల్లో ఒకరిగా నిలిచారు. తెలుగు సినిమాల విషయానికి వస్తే.. గతంలో బాహుబలి, టెంపర్ వంటి చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్‌తో గుర్తింపు పొందారు. సరైన స్క్రిప్ట్ దొరికితే టాలీవుడ్‌లో పూర్తి స్థాయి పాత్రలు చేయడానికి నోరా ఆసక్తిగా ఉన్నారు. సినిమాలతో పాటు రియాలిటీ షోల రంగంలో నోరా ఒక వెలుగు వెలుగుతున్నారు. ఝలక్ దిఖ్‌లా జా, ఇండియాస్ బెస్ట్ డ్యాన్సర్, హిప్ హాప్ ఇండియా వంటి పాపులర్ షోలకు జడ్జిగా వ్యవహరిస్తూ భారీగా ఆర్జిస్తున్నారు. తనదైన డ్యాన్స్ శైలి.. స్పష్టమైన అభిప్రాయాలతో బుల్లితెరపై తనదైన ముద్ర వేస్తున్నారు. కేవలం ఐటమ్ సాంగ్స్ మాత్రమే కాకుండా.. కథానాయికగా మడ్గావ్ ఎక్స్‌ప్రెస్ వంటి చిత్రాలతో తన నటనను కూడా నిరూపించుకుంటూ ప్రపంచ స్థాయిలో తానేంటో నిరూపిస్తున్నారు. కన్నడ చిత్రం కేడి- ది డెవిల్‌లో నోరా ఫతేహి నటించారు. అలాగే లారెన్స్ మాస్టార్ కాంచన 4లోను నోరా నటిస్తోంది. కేడి ది డెవిల్ చిత్రంలోని ఒక వివాదాస్పద పాట కారణంగా నోరా ఫతేహి పేరు ఇటీవల మార్మోగిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆ పాటను యూట్యూబ్ నుంచి తొలగించారు.

# శ్రీ క్షేత్రంలో విజయలక్ష్మికి పంచామృత అభిషేకాలు



**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రముఖ భారతీయ తత్వ దర్శన కేంద్రం శ్రీ క్షేత్రంలో కొలువై ఉన్న అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి దేవాలయంలో విజయలక్ష్మి అమ్మవా రికి పంచామృత అభిషేకాలు చేశారు. ఈరోజు ఉదయం దేవాల యం అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, అంపోలు లక్ష్మీన రసింహచార్యులు సంయుక్తంగా వేదమంత్రాలు నడుమ విజ యలక్ష్మి అమ్మవారికి పంచామృత అభిషేకాలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవంలో దేవాలయం ధర్మకర్తలు దుర్గాబాలాజీ ఉమాదేవి దంపతులు భక్తులు పాల్గొన్నారు.

# వసతి గృహాల నిర్వహణ సక్రమంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలో గల సాంఘిక సం క్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు కావలసిన మౌలిక సదు పాయాలన్నీ సక్రమంగా కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వసతి గృహాల నిర్వహణపై సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో వసతి గృహాల్లో గల సదుపాయాలు, మంజూరైన పనులను జిల్లా కలెక్టర్ సమీక్షిం చారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహాలలో శానిటేషన్, మరుగుదొడ్లు, నీటి సరఫరా వంటి మౌలిక సదుపా యాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. వసతి గృహాల్లో చేపట్టవలసిన అత్యవసర పనుల వివరాలను సోమవారం నాటికి అందజేయాలని వసతి గృహ అధికారులను ఆదేశించారు.

జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిని ఎం. అన్నపూ ర్ణమ్మ జిల్లా వ్యాప్తంగా గల వసతి గృహాలలో చేపట్టిన పనుల వివరాలను జిల్లా కలెక్టర్‌కు తెలియజేశారు. 22 వసతి గృహాలలో 439 లక్షల రూపాయలతో మరమత్తు పనులు చేపట్టి, పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సహాయ సంక్షేమ అధికా రులు, సాంఘిక సంక్షేమ గృహ అధికారులు పాల్గొన్నారు.

# మావిగన్‌తో రాష్ట్రం ఎంతగానో అభివృద్ధి చెందుతుంది

## - మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మావిగన్ (మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు) ప్రతిపాదనతో రాజధాని త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బొత్స మాట్లాడుతూ, కొన్ని దశాబ్దాలు అయినా పూర్తవుతుందో లేదో తెలియని అమరావతికి లక్షల కోట్ల రూపాయలు వ్యయం అవుతుందని, అటువంటి రాజధాని వల్ల రాష్ట్ర ప్రజలపై ఆర్థికంగా పెను భారం పడుతుందని మాజీ ఎమ్మెల్యే బొత్స అన్నారు. రెండు సంవత్సరాలలోపే మూడు లక్షల 30 వేల కోట్లు అప్పులు చేసి చంద్రబాబు ఏమి అభివృద్ధి చేశారని బొత్స ప్రశ్నించారు. రెండు లక్షల కోట్లతో అమరావతి రాజధాని పూర్తయ్యేది ఎప్పుడు అని సూటిగా ప్రశ్నించారు. అదే మావిగన్ ప్రాంతానికి 20 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే అద్భుతమైన రాజధాని ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందని బొత్స అన్నారు. దేశ రాజధాని ఢిల్లీ కంటే, ముంబాయి సరవేగంగా అభివృద్ధి చెందడానికి అక్కడ ఉన్న సముద్ర తీర ప్రాంతం పోర్టులే కారణ మన్నారు. అదేవిధంగా మావిగన్ ప్రాంతంలో కూడా పోర్టులు, విమానాశ్రయాలు, రోడ్ల కనెక్టివిటీ, రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు ఉండడంతో ఆ ప్రాంతం కూడా త్వరితగతిన అభివృద్ధి చెందుతుం దని బొత్స అన్నారు. అమరావతిలో తమ కులానికి చెందిన వారికి కాంట్రాక్టులు కట్టబెట్టేందుకే చంద్రబాబు ఆరాటమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉత్తరాంధ్రకు ఎంతో ద్రోహం చేశారని అప్పల నరసయ్య విమర్శించారు. అధికారంలోకి వచ్చిన ప్రతిసారి ఉత్తరాంధ్ర ప్రాంతానికి చంద్రబాబు అన్యాయం చేస్తున్నారని అన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో సంపదను దోచుకోవడం తప్ప ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయరని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి కింజరాపు అచ్చంనాయుడుకు దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి గురించి మాట్లాడే నైతిక హక్కు, స్థాయి లేదని అన్నారు. నాడు అధికార దాహంతోనే టిడిపి వ్యవస్థాపకుడు ఎన్టీ రామా రావుకు వెన్నుపోటు పొడిచి చంద్రబాబు అధికారంలోనికి వచ్చా డన్నారు. ఆ పన్నాగంలో అచ్చన్న కూడా భాగస్వామ్యుడు అన్నారు. తెలుగుదేశం పార్టీ హయాంలో శ్రీకాకుళం జిల్లాలో ఎటువంటి అభివృద్ధి జరిగిందో చెప్పాలని అచ్చం నాయుడును మాజీ ఎమ్మెల్యే బొత్స ప్రశ్నించారు. వైకాపా ప్రభుత్వ హయాంలోనే శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాలి మండలంలోని మూలాపేట (భావనపాడు పోర్ట్) గ్రీన్ ఫీల్డ్ పోర్ట్‌కి సంబంధించి 70 శాతం పనులు పూర్తయ్యాయని, టిడిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత మిగిలిన 30 శాతము పనులకు ఒక్క రూపాయి కూడా వెచ్చించలేదని బొత్స అన్నారు. నియోజవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ నియోజకవర్గ అభివృద్ధిని పక్కన పెట్టారని ఆరోపించారు. అధికా రంలోకి రాగానే భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని నమ్మించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఇప్పుడు ఆ ఉసే ఎత్తడం లేదన్నారు. అక్కడ కార్మికులకు కూడా బకాయిలు కూడా చెల్లిం చలేదన్నారు. నియోజకవర్గంలో సిసి రోడ్లు పనులు తప్ప, మరో అభివృద్ధి చేయడం లేదన్నారు. ఆ పనులు కూడా తమ బంధు వులకు కట్ట పెట్టారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మం డల నాయకులు కరణం ఆదినారాయణ, జడ్పిటిసి గార తౌడు, మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు బెల్లాన త్రినాధరావు, కర్రి రామ నాయుడు, మాజీ ఎంపీటీసీ రామునాయుడు, కర్రి లక్ష్మణ, పైడపు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



**భద్రాచలం, (రాజధాని వార్తలు):** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక మరియు హోమియో వైద్య పితామహుడు డాక్టర్ శామ్యూల్ హనిమన్ జన్మదిన సందర్భంగా ప్రపంచ యోగ దినోత్సవం భద్రాచలం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుష్ డిపార్ట్మెంట్ యోగ అవగాహనా శిబిరం మరియు ఆయుర్వేద, హోమియో మరియు యునాని వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరంని అనేక మంది రోగులు సద్వినియోగపరుచుకున్నారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్యశాఖ అధికారి డా. తుకారం రాథోడ్, అదనపు జిల్లా అధికారి డా. సైదులు, ఏరియా హాస్పిటల్ ఆర్ఏంఒ డా. రాజశేఖర్ రెడ్డి, ఆయుష్ జిల్లా వైద్యాధికారి డా. వెంకటేశ్వరరావు, డాక్టర్లు రాజేందర్, లావణ్య, ఉషారాణి, జయ, వెన్నెల, పూజ,,రాజేష్, పారామెడికల్ సిబ్బంది, యోగ బోధకులు తదితరులు పాల్గొన్నారు.

# "దీన్ దయాల్ స్పర్శ యోజన" విజేతలకు స్కాలర్ షిప్పులు, మెరిట్ సర్టిఫికెట్స్

## - డివిజనల్ సూపరింటెండెంట్ కే.శ్రీనివాస్





**గజపతినగరం, (విజయనగరం), (రాజధాని వార్తలు):** స్థానిక విజయన గరం హెడ్ పోస్ట్ ఆఫీస్ నందు గత సంవత్సరం అక్టోబర్ 12వ తేదీన నిర్వహించిన దీన్ దయాల్ స్పర్శ యోజన ఫిలాట్లీ ప్రతిభా పరీక్ష నందు విజయం సాధించిన విద్యార్థులకు గురువారం పోస్టల్ సూపరిండెంట్ కే.శ్రీనివాస్ స్కాలర్షిప్, మెరిట్ సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా కే శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతిభ పరీక్ష నందు విజయం సాధించిన విద్యార్థులకు 6000/- నగదు బహుమతి (నెలకు 500 రూపాయల చొప్పున), మెరిట్ సర్టిఫికెట్స్ అందజేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులలో చిన్న వయస్సు నుంచే ఫిలాట్లీ (స్టాంపుల సేకరణ) అనే అభిరుచిని ప్రోత్సహించడం దీన్ దయాల్ స్పర్శ యోజన ముఖ్య ఉద్దేశం అని సూపరింటెండెంట్ శ్రీనివాస్ అన్నారు. తపాలా శాఖ ద్వారా 6 నుండి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ విజయవాడకు కేటాయించిన మొత్తం 40 స్కాలర్ షిప్‌లలో విజయనగరం డివిజన్‌కి 21 స్కాలర్షిప్లు రావడం గర్వకా రణం అని సూపరింటెండెంట్ శ్రీనివాస్ అన్నారు. ఆరవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి చదివే విద్యార్థులకు ప్రతి తరగతికి, పది స్కాలర్ షిప్పుల చొప్పున సర్కిల్లో స్కాలర్షిప్లు కేటాయించడం జరిగిందని సూపరింటెండెంట్ శ్రీనివాస్ విలేకరులకు తెలియ జేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యాభ్యాస సమయంలో పిల్లలలో ఏర్పడే మానసిక ఒత్తిడిని తగ్గించవచ్చునని కే శ్రీనివాస్ అన్నారు. ఈ ఘనత సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరిండెంట్ జీ.వి.రామారావు, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ పూర్తి చేయాలి

## - రికార్డులు సరిదిద్దే అవకాశం ప్రభుత్వం కల్పించినందున తప్పులు సరిదిద్ది రికార్డులు శుద్ధికరణ పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** రీసర్వే పూర్తయిన గ్రామాల్లో వాటన్నింటినీ సరిదిద్ది తప్పులు లేని పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి రెవెన్యూ అధికారులను అదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం సమావేశం నిర్వహించి రీ సర్వే, పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీపై రెవిన్యూ అధికా రులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మే లేదా జూన్ నెలలో జిల్లాలో పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొనే అవకాశం ఉన్నందున ఈ ప్రక్రియను సక్రమంగా పూర్తి చేసి సిద్ధం చేయాలని తెలిపారు. జనవరి నెల నుండి ప్రణాళికబద్దంగా నిర్వహిస్తున్న పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ కార్యక్రమాన్ని ఇచ్చిన గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. రికార్డులు సరిదిద్దే అవకాశం ప్రభుత్వం కల్పించినందున తప్పులు సరిదిద్ది రికార్డులు శుద్ధికరణ పూర్తి చేయాలన్నారు. జనవరి నుంచి ఏప్రిల్ నెలవరకు 30 గ్రామాల్లో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ జరిగిందని, మే నెలకు 8 గ్రామాలలో, జూన్ నెలలో 30 గ్రామాలలో పాసు పుస్తకాలు పంపిణీ లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. అదేవిధంగా గతంలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో అవసరమైన మ్యుటేషన్‌లు, సబ్ డివిజన్, ఫారం 8 జారీ, జాయింట్ ఎల్‌పిఎం సమస్యలు పరిష్క రించి వాటన్నింటినీ సరిదిద్ది తప్పులు లేని పట్టాదారు పాస్ పుస్త కాల ముద్రణకు పంపించాలని, పంపిణీ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సేథు మాధవన్, డి ఆర్ ఒ సి.హెచ్. సత్తిబాబు, ఆర్ డి ఒలు, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

# డెకాయిట్ మూవీ సక్సెస్ సెలబ్రేషన్స్

**- థియేటర్లో అభిమానులతో కలిసి సందడి చేసిన అడివి శేష్, మృణాల్ ఠాకూర్**




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** యంగ్ హీరో అడివి శేష్, బ్యూటిఫుల్ మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన భారీ యాక్షన్ థ్రిల్లర్ 'డెకాయిట్' బాక్సాఫీస్ వద్ద ఘనవిజయాన్ని అందుకుంది. షనీల్ డియో దర్శకత్వంలో తెరకెక్కిన ఈ వినూత్న ప్రేమకథకు ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. ఈ నేపథ్యంలో, చిత్ర యూనిట్ నగరంలోని ప్రముఖ సంగం థియేటర్లో పర్యటించి ప్రేక్షకులతో కలిసి సక్సెస్ సెలబ్రేషన్స్ జరుపుకుంది.

**అభిమానుల కోలాహలం**

హీరో అడివి శేష్, హీరోయిన్ మృణాల్ ఠాకూర్ థియేటర్కు చేరుకోగానే అభిమానులు ఈలలు, కేకలతో ఘనస్వాగతం పలికారు. థియేటర్ ఆవరణ అంతా పండగ వాతావరణం నెలకొంది. తమ అభిమాన తారలను కెమెరాల్లో బంధించేందుకు ప్రేక్షకులు పెద్ద ఎత్తున పోటీ పడ్డారు. ప్రేక్షకులకు స్వయంగా అడివి శేష్, మృణాల్ గులాబీ పువ్వులను అందజేసి తమ కృతజ్ఞతలు తెలిపారు. థియేటర్లో పాటలకు హీరో హీరోయిన్లు డ్యాన్స్ చేయడంతో ప్రేక్షకుల ఆనందం రెట్టింపు అయ్యింది. సినిమా అద్భుతంగా ఉందంటూ ప్రేక్షకులు ఇచ్చిన రెస్పాన్స్కు చిత్ర యూనిట్ హర్షం వ్యక్తం చేసింది. హీరో అడివి శేష్ మాట్లాడుతూ డెకాయిట్ చిత్రాన్ని ఇంత పెద్ద సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఈ విజయం కేవలం అభిమానులకే అంకితం. థియేటర్లలో మీ నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే చాలా గర్వంగా, ఆనందంగా ఉంది, అని పేర్కొన్నారు. హీరోయిన్ మృణాల్ ఠాకూర్ మాట్లాడుతూ మా సినిమాను మీరు గుండెలకు హత్తుకోవడం చాలా సంతోషాన్నిస్తోంది. మీ ప్రేమను ఇలాగే కొనసాగించాలని కోరుకుంటున్నాను అని అన్నారు.

# చెందోడు పంచాయతి ఆర్ బి కె లో ఇరిగేషన్ అధికారుల సమావేశం



**కోట, (రాజధాని వార్తలు):** మండల కేంద్రంలోని విద్యానగర్లో గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ సూచనలు మేరకు కోట మండలం చెందోడు పంచాయతీ ఆర్ బి కె కేంద్రం వద్ద ఇరిగేషన్ ఏఈ మరియు టీడీపీ సీనియర్ నాయకులు, ఆయకట్టు ప్రెసిడెంట్ అయినటువంటి వేణుంబాక మాధవ కృష్ణ రెడ్డి, టీడీపీ నాయకులు బందిల రఘురామ్, గ్రామ కమిటీ అధ్యక్షులు పుచ్చలపల్లి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. తదనంతరం ఏఈ పంచాయతీలోని చేను కాలువలు మరియు చెక్ డ్యాంలు, కాలువలో పేరుకుపోయిన మట్టి, గడ్డిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని రైతులు కోరినటువంటి అన్ని పనుల మీద దృష్టి సారిస్తామని తెలియజేయడం జరిగింది. ఈ సమావేశానికి తిరుపతి శివకుమార్, చల్లా మల్లికార్జున్, మేకల శ్రీనివాసులు, వర్క్ ఇన్స్పెక్టర్, జూనియర్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, రైతులు, ఆయకట్టు మెంబెర్స్ మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# బొత్సతో "తెలుగుశక్తి" బి.వి.రామ్ భేటీ

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో ప్రతిపక్ష నేత, వైసీపీ ముఖ్య నాయకుడు బొత్స సత్యనారాయణను తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ (బి.వి.ఆర్) కలుసుకున్నారు. శుక్రవారం ఉదయం సిరిపురంలోని బొత్స నివాసంలో ఇరువురు భేటీ అయ్యారు. ఇటీవల కాలంలో బొత్స ఆరోగ్యం కాస్త మందగించిన నేపథ్యంలో ఈ భేటీ కొనసాగింది. "ప్రస్తుతం మీ ఆరోగ్యం ఎలా ఉందని, ఏది ఏమైనా మంచి ఆరోగ్యంతో ఉండాలని" బివిఆర్ ఆకాంక్షించారు. రాష్ట్రంలో ప్రత్యేకించి ఉత్తరాంధ్ర ప్రాంతంలో ప్రత్యేక గుర్తింపు పొందిన బొత్స సత్యనారాయణకు తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ తండ్రి దివంగత బి.వి.రామారావుతో కూడా మంచి అనుబంధం ఉండేది. ఇదే విషయాన్ని బొత్స మరోసారి గుర్తు చేసుకున్నారు.



# బిగ్ బాస్‌తోనే తగిన గుర్తింపు

## - ప్రజల ఆదరణ మరపురానిది
## - కళ్యాణ్ పడాలను ఘనంగా సత్కరించిన గంట్ల



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** బిగ్ బాస్ షోతోనే తనకు తగిన గుర్తింపు లభించిందని సీజన్ 9 విజేత కళ్యాణ్ పడాల అన్నారు. శుక్రవారం జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ఎన్ఏజే ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు నివాసానికి విచ్చేసిన సంద ర్భంగా కళ్యాణ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళ్యాణ్ మాట్లాడుతూ తాను విజేతగా నిలిచేందుకు ప్రజల సహకారం మరువలేనిదన్నారు. లక్షలాది మంది ప్రజలు ఆదరణ తనను విజేతగా నిలిపిందన్నారు. గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ భవిష్యత్తులో కళ్యాణ్ మరింత ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కళ్యాణ్‌ను ఘనంగా సత్కరించి వెంకటేశ్వర స్వామి జ్ఞాపికను గంట్ల శ్రీనుబాబు కుటుంబ సభ్యులు బహుకరించారు. ఈ కార్యక్రమంలో బిగ్ బాస్ ఫేమ్ దమ్ము శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

# రూ.10 కోట్ల ప్రభుత్వ భూమిని స్వాహా చేసిన జనసేన నేత జీ.కే

**- 500 గజాల్లో అక్రమ షెడ్డు నిర్మాణం వ్యాయామశాల పేరుతో వసూళ్లు**
**- తక్షణమే చర్యలు తీసుకోకుంటే మరింత పోరాటం ఉధృతం చేస్తాం**




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** దక్షిణ నియోజక వర్గం 33వ వార్డు జనసేన మాజీ కార్పొరేటర్ భర్త జీకే రూ.10 కోట్ల విలువచేసే ప్రభుత్వ భూమిని కబ్జా చేసి 500గజాల్లో అక్రమ షెడ్డు నిర్మించడం తీవ్ర దుమారం రేపుతోందని మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెల్లవారేసరికి నీతులు బోధించే పవన్ కళ్యాణ్ పార్టీ నేత జీకే అలియాస్ గోపాలకృష్ణ అక్రమంగా షెడ్ వెయ్యడమే కాకుండా వ్యాయామశాల నెలకొల్పి వారి దగ్గర నుండి డబ్బులు వసూలు చేస్తున్నారని వాసుపల్లి ఆరోపించారు. దక్షిణ వైసీపీ శ్రేణులతో కలిసి 33 వ వార్డు నీలమ్మ వేపచెట్టు ఎంజీఎం స్కూల్ సమీపంలో ఆక్రమ స్థలం వద్ద శుక్రవారం ర్యాలీగా వచ్చి ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి మీడియాతో మాట్లాడుతూ 33వ వార్డు వైసిపి అధ్యక్షుడు ముత్తా బత్తుల రమేష్, మాజీ కార్పొరేటర్ పచ్చిరపల్లి రాము ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారన్నారు. అయినప్పటికీ అధికారుల్లో స్పందన లేకపోవడంతో ఈ ధర్నా కార్యక్రమం చేపట్టామన్నారు. 50 కోట్ల రూపాయల ప్రభుత్వ స్థలంలో అక్రమంగా షెడ్డు వేసి అనధికారకంగా యువత దగ్గర వ్యాయామశాల పేరుతో డబ్బులు వసూలు చేయడం, అలాగే జీవీఎంసీ నుండి నీరు, కరెంటు అక్రమంగా వాడుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. కూటమి ప్రభుత్వంలో జనసేన పార్టీలో ఉండి తాము నచ్చినట్టు వ్యవహరిస్తామన్న 33 వ వార్డు జనసేన మాజీ కార్పొరేటర్ భర్త జీకే అలియాస్ గోపాలకృష్ణ చేస్తున్న దందాలు కబ్జాలపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వాసుపల్లి గణేష్ కుమార్ డిమాండ్ చేశారు. ఇంత బహిర్గతంగా ప్రభుత్వ స్థలాలను దోచుకోవడమే కాకుండా, ఉచితంగా నీరు విద్యుత్తును కూడా వాడుకోవడం బహుశా జనసేన పార్టీ అండదండలతో జరిగి ఉండవచ్చునని భావిస్తున్నామన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు, నారా లోకేష్, పవన్ కళ్యాణ్ ప్రజలను మభ్యపెట్టి అందలం ఎక్కారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చక పోగా ప్రజల సొమ్మును లూటీ చేస్తే వైసిపి చూస్తూ ఊరుకోదని వాసుపల్లి హెచ్చరించారు. కూటమి ప్రభుత్వంలో చేస్తున్న కబ్జాలు, దందాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయన్నారు. వచ్చే జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రభుత్వ స్థలాలు లూటీ చేసేవారు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వాసుపల్లి గణేష్ కుమార్ జోష్యం చెప్పారు.

# రూ.10 కోట్ల ప్రభుత్వ భూమిని స్వాహా చేసిన జనసేన మాజీ కార్పొరేటర్ భర్త(జీ.కే)

**- 500 గజాల్లో అక్రమ షెడ్డు నిర్మాణం..వ్యాయామశాల పేరుతో వసూళ్లు - అక్కడి ఫ్రీగా జీవీఎంసీ నీరు, విద్యుత్ వాడేస్తున్న వైనం - తక్షణమే చర్యలు తీసుకోకుంటే పోరాటం మరింత ఉధృతం చేస్తాం - వైసీపీ శ్రేణులతో కలిసి ధర్నా చేసిన మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి**






**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** దక్షిణ నియోజకవర్గం 33వ వార్డు జనసేన మాజీ కార్పొరేటర్ భర్త జీకే రూ.10 కోట్ల విలువచేసే ప్రభుత్వ భూమిని కబ్జా చేసి 500గజాల్లో అక్రమ షెడ్డు నిర్మించడం తీవ్ర దుమారం రేపుతోందని మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెల్లవారేసరికి నీతులు బోధించే పవన్ కళ్యాణ్ పార్టీ నేత జీకే అలియాస్ గోపాలకృష్ణ అక్రమంగా షెడ్ వెయ్యడమే కాకుండా వ్యాయామశాల నెలకొల్పి వారి దగ్గర నుండి డబ్బులు వసూలు చేస్తున్నారని వాసుపల్లి ఆరోపించారు. దక్షిణ వైసీపీ శ్రేణులతో కలిసి 33వ వార్డు నీలమ్మ వేపచెట్టు ఎంజీఎం స్కూల్ సమీపంలో ఆక్రమ స్థలం వద్ద శుక్రవారం ర్యాలీగా వచ్చి ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి మీడియాతో మాట్లాడుతూ 33 వ వార్డు వైసిపి అధ్యక్షుడు ముత్తా బత్తుల రమేష్, మాజీ కార్పొరేటర్ పచ్చిరపల్లి రాము ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారన్నారు. అయినప్పటికీ అధికారుల్లో స్పందన లేకపోవడంతో ఈ ధర్నా కార్యక్రమం చేపట్టామన్నారు. 50 కోట్ల రూపాయల ప్రభుత్వ స్థలంలో అక్రమంగా షెడ్డు వేసి అనధికారకంగా యువత దగ్గర వ్యాయామశాల పేరుతో డబ్బులు వసూలు చేయడం, అలాగే జీవీఎంసీ నుండి నీరు, కరెంటు అక్రమంగా వాడుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. కూటమి ప్రభుత్వంలో జనసేన పార్టీలో ఉండి తాము నచ్చినట్టు వ్యవహ రిస్తామన్న 33వ వార్డు జనసేన మాజీ కార్పొరేటర్ భర్త జీకే అలియాస్ గోపాలకృష్ణ చేస్తున్న దందాలు కబ్జాలపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవా



లని వాసుపల్లి గణేష్ కుమార్ డిమాండ్ చేశారు. ఇంత బహిర్గతంగా ప్రభుత్వ స్థలాలను దోచు కోవడమే కాకుండా, ఉచితంగా నీరు విద్యుత్తును కూడా వాడుకోవడం బహుశా జనసేన పార్టీ అండదండలతో జరిగి ఉండవచ్చునని భావిస్తున్నామన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు, నారా లోకేష్, పవన్ కళ్యాణ్ ప్రజలను మభ్యపెట్టి అందలం ఎక్కారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చక పోగా ప్రజల సొమ్మును లూటీ చేస్తే వైసిపి చూస్తూ ఊరుకోదని వాసుపల్లి హెచ్చరించారు. కూటమి ప్రభుత్వంలో చేస్తున్న కబ్జాలు, దందాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయన్నారు. వచ్చే జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రభుత్వ స్థలాలు లూటీ చేసేవారు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వాసుపల్లి గణేష్ కుమార్ జోష్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ, మాజీ కార్పొరేటర్లు వార్డ్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెవెన్యూ అధికారులు సమస్యలను సత్వర పరిష్కరించాలి : జాయింట్ కలెక్టర్



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి రెవెన్యూ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో రెవెన్యూ అధికారుల కాన్ఫరెన్సును నిర్వహించారు. ఈ సదస్సులో రెవెన్యూ క్లినిక్, పిజిఆర్ఎస్ గ్రీవెన్స్, మ్యూటేషన్లు, చుక్కల భూములు, 22ఎ కేసులు, జీరో ఖాతాలు, రీ సర్వే, పెండింగ్ కోర్టు కేసులు మొదలైన రెవెన్యూ అంశాలపై జాయింట్ కలెక్టర్ సుదీర్ఘంగా చర్చించారు. మండలాల వారీగా తహశీల్దార్లతో పెండింగ్ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ తహశీల్దారు కార్యాలయాల్లో ఒక ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ రూపొందించుకుని పనిచేస్తే పెండింగ్ సమస్యలను సులభంగా పరిష్కరించవచ్చున్నారు. రెవెన్యూ సమస్యలపై ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన అమెండ్ మెంట్ సర్క్యులర్స్‌ను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలన్నారు. జిల్లాలో కోర్టు కేసులు ఎక్కువగా పెండింగ్లో ఉన్నాయని చివరి వరకు వేచి చూడకుండా సకాలంలో తాసిల్దార్లు కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించారు. పట్టాదారు పాస్ పుస్తకాలు తప్పులను వెంటనే సరి చేయాలన్నారు. రీ సర్వే సమస్యలపై వచ్చిన అర్జీలను పెండింగ్ లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్సులో డిఆర్వో విజయ్‌కుమార్, ఆర్డీవోలు అనూష, పావని, ఎలీషా, సర్వే ల్యాండ్ రికార్డుల డిడి నాగశేఖర్, తహశీల్దార్లు, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఏ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మండడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ టి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎష్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# ఘనంగా మహాత్మా జ్యోతిబా పూలే 200వ జయంతి రాష్ట్ర స్థాయి వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలియజేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**బీసీల రాజకీయ ఎదుగుదల**

1982 లో స్వర్గీయ నందమూరి తారక రామారావు పార్టీని స్థాపించిన తర్వాతే బీసీలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో గౌరవప్రదమైన గుర్తింపు లభించిందని మంత్రి గుర్తు చేశారు. ఆ కాలం నుండి బీసీల అభివృద్ధికి పునాది పడిందన్నారు.

**విద్యా వ్యవస్థలో మార్పులు**

రాష్ట్రంలో బీసీ వర్గాల విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ, వందల సంఖ్యలో రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలను ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. ఈ విద్యా సంస్థలు బీసీ విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన బాటలు వేస్తున్నాయని అన్నారు.

**బీసీ భవనాల నిర్మాణం**

గత ప్రభుత్వం బీసీ భవనాల నిర్మాణాన్ని నిలిపివేస్తే, కూటమి ప్రభుత్వం ప్రతి జిల్లా కేంద్రంలో బీసీల ఆత్మగౌరవానికి ప్రతీకగా భవనాలను నిర్మిస్తున్నారన్నారు. రాష్ట్రం ఆర్థికంగా కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, ముఖ్యమంత్రి నాయకత్వంలో బీసీల సమగ్ర అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనలో అందరూ ఐక్యంగా కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర గనులు, భూగర్భ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ... పండుగ వాతావరణంలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. దేశంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి, ముఖ్యంగా విద్యా మరియు సామాజిక సమానత్వం కోసం పోరాడిన తొలి మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని కొనియాడారు. కుల వివక్షను ధైర్యంగా ఎదిరిస్తూ, తన భార్య సావిత్రిబాయి పూలేను దేశంలోని తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దిన మహత్తర కృషిని ఈ సందర్భంగా మంత్రి స్మరించుకున్నారు. సమాజంలో సమానత్వం నెలకొల్పేందుకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. 1982లో మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్.టి. రామారావు పార్టీ స్థాపన అనంతరం బీసీలకు రాజకీయంగా గుర్తింపు లభించిందన్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల అమలు ద్వారా అనేక మంది బీసీ నాయకులు ఎదిగే అవకాశం పొందారని అన్నారు. గత ప్రభుత్వం బీసీల సంక్షేమాన్ని విస్మరించడంతో పాటు, అక్రమ కేసులు నమోదు చేసి వేధింపులకు గురి చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీల రక్షణ కోసం ప్రత్యేకంగా "రక్షణ చట్టం" తీసుకువస్తామని హామీ ఇచ్చారు. బీసీలు కేవలం సబ్సిడీలకే పరిమితం కాకుండా, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, దానికి అవసరమైన విధి విధానాలను ప్రభుత్వం రూపొందిస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. దేశంలోని అన్ని భాషల పత్రికలలో మహాత్మా జ్యోతిబా పూలే గురించి వ్యాసాలు ప్రచురితమయ్యాయన్నారు. 200 ఏళ్ల క్రితం జన్మించినప్పటికీ, ఆయన సామాజిక సంస్కరణలు నేటికీ భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని కొనియాడారు. బీసీల సాధికారతకు పూలే ప్రేరణ అనేక అడ్డంకులు, అవమానాల మధ్య కూడా బీసీల సాధికారత కోసం మహాత్మా జ్యోతి బా పూలే చేసిన కృషిని మంత్రి స్మరించుకున్నారు. ఆయన పోరాటం సమాజంలో సమానత్వానికి బాటలు వేసిందన్నారు. రాజకీయ ప్రాధాన్యత మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ నుండి నేటి ముఖ్యమంత్రి వరకు రాష్ట్రంలో బీసీలకు రాజ్యాధికారం కల్పించాలనే లక్ష్యంతో కృషీ చేస్తున్నారన్నారు. ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని, మంత్రివర్గంలో 8 మంది బీసీలకు ప్రాధాన్యత కల్పించారని తెలిపారు. జాతీయ స్థాయిలో కూడా కేంద్రంలో 27 మంది బీసీ మంత్రులు ఉండటం గర్వకారణమని, ఒక సాధారణ బీసీ కుటుంబం నుంచి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ నేడు ప్రపంచ నాయకుడిగా ఎదగడం బీసీలందరికీ ప్రేరణగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలు బీసీలకు బలమైన మద్దతు అన్నారు. 127వ రాజ్యాంగ సవరణ ద్వారా రాష్ట్రాలకు బీసీలను గుర్తించే అధికారాన్ని కల్పించడాన్ని మంత్రి స్వాగతించారు. ముద్రా యోజన, కిసాన్ యోజన, స్వనిధి వంటి పథకాల ద్వారా బీసీలకు విస్తృత ప్రయోజనాలు అందుతున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బడ్జెట్‌లో బీసీ సాధికారత కోసం 56,000 కోట్లను కేటాయించడం ప్రభుత్వ కట్టుబాటుకు నిదర్శనమన్నారు. గత ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ పేరుతో మోసం చేసిందని, బీసీ నాయకులను వేధించిందని మంత్రి విమర్శించారు. బీసీలు కులాల పేరుతో విడిపోకుండా ఐక్యంగా ఉండాలని, అదే మహాత్మా జ్యోతిబా పూలేకు నిజమైన నివాళి అవుతుందని పిలుపునిచ్చారు. వీజీపీ అనే సంక్షిప్త రూపం బదులు "మహాత్మా జ్యోతి బా పూలే" అనే పూర్తి పేరుతో పాఠశాలలను పిలవాలని, తద్వారా విద్యార్థులకు ఆయన గొప్పతనం తెలుస్తుందని సూచించారు. స్థానిక శాసనసభ్యులు బోండా ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ... బీసీ వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్ని రంగాల్లో వారిని ముందుకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. శాసనసభ్యులు వర్ల కుమార రాజా మాట్లాడుతూ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబా పూలే ఆశయాలను కూటమి ప్రభుత్వం కార్యరూపంలోకి తీసుకువస్తోందన్నారు. ముందుగా మహాత్మా జ్యోతి బా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి మంత్రులు ఘన నివాళులు అర్పించారు. సామాజిక సేవా రంగంలో విశేష కృషి చేసిన 11 మంది ప్రతిభావంతులకు మహాత్మా పూలే రాష్ట్ర స్థాయి పురస్కారాలు అందజేయడం జరిగింది. బీసీ కార్పొరేషన్ చైర్మన్లను మంత్రి సవిత సత్కరించారు. ఈ కార్యక్రమానికి గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి, రెడ్డి రత్న కుమారి, సత్యనారాయణ, కలెక్టర్ డా.జి.లక్ష్మీశ తదితరులు హాజరయ్యారు.

# పోషకాహార ప్రాధాన్యంపై అవగాహన



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పోషకాహారం దాని ప్రాధాన్యంపై అవగాహన కార్యక్రమం పెద్దాపురం మండలంలోని చిన్న బ్రహ్మదేవం ఆర్ బి పట్నం గ్రామాల్లో 8వ "పోషణ పక్వడ" కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఐసిడిఎస్ పెద్దాపురం ప్రాజెక్టు అధికారి జి ఉష ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానంగా పోషకాహారం ప్రదర్శన, వాటి ప్రాధాన్యతపై తల్లులకు, గర్భిణిలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిడిపివో ఉష మాట్లాడుతూ మనకు అందుబాటులో ఉన్న కూరగాయలు, ఆకు కూరల్లో ఎన్నో పోషకాలు ఉన్నాయన్నారు. వాటిని ఉపయోగించుకుని ఆరోగ్యంగా జీవించాలన్నారు. ఇంకా గర్భిణులు, తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్య జాగ్రత్తలు, చిన్నారుల ఆరోగ్యం, పిల్లల్లో స్క్రీన్ టైమ్ తగ్గించడం, ఆట పాటలతో కూడిన విద్య, తల్లి దండ్రలకు అవగాహన కార్యక్రమాలు వంటి అంశాలపై సిడిపివో ఉష వివరించి అవగా హన కల్పించారు. ఈ అంగన్వాడీ సూపెర్వైజర్‌లు రమణమ్మ, డ్వాక్రా వివోలు సుజాత, కె వెంకట లక్ష్మి, సిబి దేవం హెచ్ ఎం సి హెచ్ వెంకట రమణ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాతా శిశు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పోషణ్ అభియాన్ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం రెండోరోజు మాతా శిశు ఆరోగ్యంపై తల్లులకు, గర్భిణీలకు, కమ్యూనిటీకి అవగాహన కల్పించారు. ఎనిమిదవ పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సామర్లకోట మున్సిపాలిటీలో కోట బాజర్, మార్కెట్ ఏరియా కేంద్రంలో మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ పెద్దాపురం ప్రాజెక్ట్ సిడిపిఓ జి ఉషా ఆధ్వర్యంలో గర్భవతులకు, బాలిం తలు, కమ్యూనిటీకి మాతా శిశు ఆరోగ్యం మరియు పోషణ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భదారణ సమయంలో ఆహారం మరియు సంరక్షణ, హెల్త్ చెకప్స్, పెరగవలసిన బరువు, పుట్టిన వెంటనే తల్లి పాల బిడ్డకు ప్రారంభం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మాతా శిశు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్రం పరిసర ప్రాంతాల్లో ర్యాలీ చేప ట్టారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు సుల్తాన్ బీబి, ఎన్ ఉమాదేవి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ అధికారి జె.విజయ, ఏఎన్ఎంలు, యస్ కమలాదేవి, బి శ్రీరామ లక్ష్మి, సి హెచ్ భవాని, ఎల్.రత్నకుమారి, అంగన్వాడీ టీచర్స్ వెంకటలక్ష్మి, వాణి దేవి, పద్మ, రమాదేవి, రాజ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan